S TV SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

**విలేకరులు కావలెను**

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.

**7036644111, 9490140565**

సంపుటి: 19 | సంచిక: 293 | ఎడిటర్ : అలీ ముర్తుజా | ఆదివారం 13 సెప్టెంబర్ 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 8 | వెల:రూ.5 |

# తెలంగాణ భవన్‌లో మాక్ అసెంబ్లీ



## సస్పెన్షన్లకు నిరసనగా బీఆర్ఎస్ నమూనా సభ

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై సెటైర్ల వర్షం!
- స్పీకర్‌గా జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు
- 'సీఎం' పాత్రలో తలసాని శ్రీనివాస్ యాదవ్
- కొండా సురేఖ తొలగింపుపై వ్యంగ్యాస్త్రాలు
- వంద రోజుల హామీలపైనా చురకలు

3

# దసరా కానుకగా కొత్త పింఛన్లు

- రాష్ట్రవ్యాప్తంగా 2.50 లక్షల మందికి అవకాశం
- ఇంటింటికీ వెళ్లి అర్హుల పరిశీలన
- ఈ నెలాఖరులోగా క్షేత్రస్థాయి తనిఖీలు
- వచ్చే నెల తొలివారంలో తుది జాబితా

2





4

ఐరాస భద్రతా మండలి సంస్కరణలకు

## గళమెత్తిన కూటమి

- చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో మోదీ కీలక భేటీ

## అతిథి దేవో భవ

విదేశీ నేతలకు ప్రత్యేక వెండి పాత్రల్లో భారతీయ రాజసం వంటకాలు

జకీర్ నాయక్ అప్పగింతపై

## చర్చించాం

- మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం ప్రకటన
- బ్రిక్స్ సదస్సు వేదికగా ప్రధాని మోదీతో ద్వైపాక్షిక భేటీలో జకీర్ ప్రస్తావన





4

# బ్రిక్స్‌లో 'న్యూఢిల్లీ' ఏకతాటిపై!

## సంయుక్త ప్రకటనకు సభ్య దేశాల ఏకగ్రీవ ఆమోదం

- యుద్ధం కాదు.. చర్చలు, దౌత్యమే మార్గమని స్పష్టీకరణ
- ఐరాస భద్రతా మండలిలో సంస్కరణలకు పిలుపు
- మానవాభివృద్ధికే అగ్రతాంబూలం అన్న ప్రధాని మోదీ
- ప్రపంచ నేతలతో వరుస ద్వైపాక్షిక భేటీలు

ప్రపంచ ఆర్థిక, రాజకీయ యవనికపై శరవేగంగా మారుతున్న సమీకరణల నడుమ భారత అధ్యక్షతన ఢిల్లీ వేదికగా జరుగుతున్న 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు విశ్వశాంతికి, ప్రపంచ మానవాళి సంక్షేమానికి సరికొత్త దిశను నిర్దేశిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఆహారం, ఇంధనం, ఆరోగ్యం, విపత్తుల నిర్వహణ, కీలకమైన సరఫరా వ్యవస్థల పరిరక్షణే లక్ష్యంగా సాగుతున్న ఈ రెండు రోజుల సదస్సు ప్రారంభ సమావేశంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ కీలక ప్రసంగం చేశారు. బ్రిక్స్ ఏర్పడి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంలో, ఈ వేదిక పరిపక్వత సాధించి సరికొత్త ప్రతిష్టాత్మక అజెండాతో కొత్త దశలోకి అడుగుపెడుతోందని ఆయన అభివర్ణించారు. బ్రిక్స్ ఏ రకమైన వర్గానికీ వ్యతిరేకం కాదని, అందరినీ కలుపుకొని ముందుకు సాగడమే దీని ప్రధాన విధానమని స్పష్టం చేశారు. - న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12 (సమయం న్యూస్)




వివరాలు 4వ పేజీలో..




2

# గణేశ్ ఉత్సవాలపై నిరంతర నిఘా

- మున్సిపల్-పోలీస్ శాఖల సమన్వయం
- ప్రత్యేక అధికారుల నియామకానికి ఆదేశం
- కమాండ్ కంట్రోల్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్
- మండపాలకు ఉచిత విద్యుత్: సీఎం రేవంత్
- నిమజ్జనానికి చెరువుల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు

# ఆరేళ్ల చిన్నారిపై ఘోరం




- మేనమామకు మరణశిక్ష
- అత్యాచారం, హత్య కేసులో ఫాస్ట్‌ట్రాక్ కోర్టు తీర్పు
- 17 నెలల్లోనే పూర్తయిన కేసు విచారణ

4

# ఒక్క క్లిక్‌తో హైడ్రా సేవలు



- అందుబాటులోకి అధికారిక వెబ్‌సైట్
- అత్యవసర సహాయం నుంచి చెరువుల వివరాల దాకా అగ్నిమాపక అనుమతులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు

2

# క్యూర్ బిల్లుకు మండలి ఆమోదం

- కోర్ అర్బన్ రీజియన్ 2026 బిల్లుకు గ్రీన్‌సిగ్నల్
- హైదరాబాద్ అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వ నిర్ణయం

4





2

# కొత్త రైళ్ల కొనుగోలుకు పచ్చజెండా

మెట్రో ప్రయాణికులకు శుభవార్త

- 600 కోట్ల వ్యయంతో కొత్త రైళ్ల కొనుగోలు
- రద్దీని తగ్గించేందుకు ప్రభుత్వ నిర్ణయం

# తెలంగాణకు మరో వారం వానలే!

- రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు
- 24 గంటల్లో పలుచోట్ల భారీ వర్షాలకు అవకాశం
- ఆరు జిల్లాల్లో వర్షాల ప్రభావం అధికం
- హైదరాబాద్‌లోనూ మోస్తరు వానలు
- సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచన



తెలంగాణలో వర్షాల ఉద్ధృతి ఇప్పట్లో తగ్గే సూచనలు కనిపించడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా మరో వారం రోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రానున్న 24 గంటల్లో పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరికలు జారీ చేసింది.

2

# నిరుద్యోగులకు టీజీపీఎస్సీ షాక్

2

- 2022 ఉద్యోగ నోటిఫికేషన్ రద్దు
- 544 పోస్టుల ప్రకటనకు బ్రేక్
- నోటిఫికేషన్ 33/2022 రద్దు
- పాత ప్రకటనతో నియామకాలు లేనట్టే
- త్వరలోనే కొత్త నోటిఫికేషన్






# నిరుద్యోగులకు టీజీపీఎస్సీ షాక్

## 2022 ఉద్యోగ నోటిఫికేషన్ రద్దు

## 544 పోస్టుల ప్రకటనకు బ్రేక్

## నోటిఫికేషన్ 33/2022 రద్దు

**హైదరాబాద్, సెప్టెంబర్ 12 (సమయం న్యూస్):** ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కీలక సమాచారం వెల్లడించింది. అసిస్టెంట్ ప్రొఫెసర్లు (లెక్చరర్లు), ఫిజికల్ డైరెక్టర్లు, లైబ్రేరియన్ పోస్టుల భర్తీ కోసం 2022లో జారీ చేసిన బ్రీఫ్ నోటిఫికేషన్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. మొత్తం 544 ఖాళీల భర్తీకి సంబంధించిన నోటిఫికేషన్ నంబర్ 33/2022ను తక్షణమే రద్దు చేసినట్లు వెబ్‌నోట్‌లో వెల్లడించింది. కాలేజియేట్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్లు (లెక్చరర్లు), ఫిజికల్ డైరెక్టర్లు, లైబ్రేరియన్ పోస్టుల భర్తీ కోసం 2022 డిసెంబర్ 31న టీజీపీఎస్సీ బ్రీఫ్ నోటిఫికేషన్ నంబర్ 33/2022ను విడుదల చేసింది. దీని ద్వారా మొత్తం 544 ఖాళీలను భర్తీ చేయాలని నిర్ణయించింది. అయితే ఈ నోటిఫికేషన్‌కు సంబంధించిన వివిధ అంశాలపై సుదీర్ఘంగా చర్చించిన కమిషన్.. అన్ని పరిస్థితులను సమగ్రంగా పరిశీలించిన అనంతరం పాత ప్రకటనను పూర్తిగా రద్దు చేయాలని నిర్ణయించినట్లు తెలిపింది. దీంతో 2022 నాటి బ్రీఫ్ నోటిఫికేషన్ ఆధారంగా ఇకపై నియామక ప్రక్రియ కొనసాగదని అభ్యర్థులు గుర్తించాలని సూచించింది.


### త్వరలో కొత్త ప్రకటన

పాత నోటిఫికేషన్‌ను రద్దు చేసిన నేపథ్యంలో ఆయా పోస్టుల భర్తీకి త్వరలోనే కొత్త నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు టీజీపీఎస్సీ స్పష్టం చేసింది. కొత్త ప్రకటన వెలువడిన తర్వాత అందులో పేర్కొనే పోస్టుల సంఖ్య, అర్హతలు, వయోపరిమితి, రిజర్వేషన్లు, దరఖాస్తు తేదీలు, ఎంపిక విధానం తదితర వివరాలను అభ్యర్థులు పరిశీలించాలని సూచించింది. కొత్త నోటిఫికేషన్ ప్రస్తుత నిబంధనలు, రోస్టర్ పాయింట్లు, రిజర్వేషన్ విధానాలకు అనుగుణంగా రూపొందించే అవకాశం ఉంది. దీంతో డిగ్రీ కళాశాలల్లో లెక్చరర్, ఫిజికల్ డైరెక్టర్, లైబ్రేరియన్ పోస్టుల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులు మరోసారి కొత్త నోటిఫికేషన్ కోసం వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

# కొత్త రైళ్ల కొనుగోలుకు పచ్చజెండా

## మెట్రో ప్రయాణికులకు శుభవార్త

**హైదరాబాద్, సెప్టెంబర్ 12:** హైదరాబాద్ మెట్రో ప్రయాణికులకు ప్రభుత్వం గుడ్ న్యూస్ తెలిపింది. మెట్రో రైళ్లల్లో రద్దీని తగ్గించేందుకు ప్రభుత్వం మందడుగు వేసింది. ప్రస్తుతం పీక్ సమయాల్లో మెట్రోలలో విపరీతమైన రద్దీ ఉంటుంది. కనీసం నిల్చోవడానికి కూడా స్థలం ఉండటం లేదు. ఈ సమస్యతో మెట్రో ప్రయాణికులు ఎప్పటినుంచో ఇబ్బంది పడుతుండగా.. ఇప్పుడు పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధమైంది. రద్దీని తగ్గించేందుకు కొత్త రైళ్లను తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం కొత్త రైళ్లను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం రెడీ అవుతోంది. ఒక్కో రైల్లో 2 వేల మంది ప్రయాణించేందుకు వీలుగా 6 కోచ్‌ల రైళ్లను ప్రవేశపెట్టనుంది.తొలి దశలో 60 కోచ్‌లను కొనుగోలు చేయనుండగా.. ఆరు కోచ్‌లతో కూడిన 10 కొత్త రైళ్లను అందుబాటులోకి తీసుకొస్తారు. ఒక్కో రైలుకు రూ.60 కోట్ల వరకు ఖర్చు కానుంది. 60 కోచ్‌ల కొనుగోలుకు రూ.600 కోట్ల వరకు వ్యయం కానుందని అంచనా వేశారు. త్వరలోనే కొత్త రైళ్ల కోసం టెండర్లను ఆహ్వానించనున్నారు. బిడ్ల కోసం నోటిఫికేషన్ జారీ చేసిన తర్వాత తుది వ్యయం ఎంత అవుతుందనేది తెలియనుంది. ప్రస్తుతం ఉన్న మెట్రో రైళ్లల్లో మూడు కోచ్‌లు మాత్రమే అందుబాటులోకి ఉన్నాయి. దీంతో ఒకేసారి వెయ్యి మంది మాత్రమే ప్రయాణించడానికి వీలు కలుగుతుంది. అదే ఆరు కోచ్‌లు అందుబాటులోకి వస్తే ఒకేసారి 2 వేల మంది ప్రయాణించవచ్చు. ప్రయాణికుల సంఖ్య దాదాపు రెట్టింపు అవుతుంది. వీటి వల్ల ఒకేసారి ఎక్కువమంది ప్రయాణికులకు తమ గమ్యస్థానాలకు చేర్చవచ్చు.ఎక్కువ కోచ్‌లు కలిగిన రైళ్లు ఉండటం వల్ల ప్రయాణికుల రద్దీ కూడా తగ్గుతుంది. ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీ విపరీతంగా ఉండటం వల్ల కనీసం అడుగు వేసేందుకు కూడా ఖాళీ స్థలం ఉండటం లేదు. దీని వల్ల ఇబ్బంది పడుతూ ప్రయాణం చేయాల్సి వస్తోంది. కొన్నిసార్లు తర్వాతి రైలు కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. ప్రస్తుతం మెట్రోలో రోజూ 4.5 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. అయితే కొత్త మెట్రో రైళ్లు వస్తే 6 లక్షల వరకు పెరుగుతుందని అధికారులు చెబుతున్నారు. అమీర్ పేట-రాయదుర్గం మార్గంలో ఎక్కువ రద్దీ ఉంటుంది. ఉదయం ఆఫీసులకు వెళ్లే సమయంలో, సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చే సమయాల్లో రద్దీ ఎక్కువగా ఉంటుంది. దీని వల్ల రాయదుర్గం స్టేషన్‌లో కొన్నిసార్లు ప్రయాణికులకు కొద్దిసేపు ఆపాల్సి వస్తోంది. రద్దీని నియంత్రించేందుకు అధికారులు ఈ ప్రయత్నం చేస్తున్నారు. దీంతో కొత్త రైళ్లను తీసుకొచ్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఇవి అందుబాటులోకి వస్తే ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. సౌకర్యవంతంగా ప్రయాణం చేయవచ్చు.



# గణేశ్ ఉత్సవాలపై నిరంతర నిఘా

## మున్సిపల్-పోలీస్ శాఖల సమన్వయం

## ప్రత్యేక అధికారుల నియామకానికి ఆదేశం

## కమాండ్ కంట్రోల్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్

## మండపాలకు ఉచిత విద్యుత్: సీఎం రేవంత్

## నిమజ్జనానికి చెరువుల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు



**హైదరాబాద్, సెప్టెంబర్ 12 (సమయం న్యూస్):** హైదరాబాద్ మహానగరంలో గణేశ్ ఉత్సవాలు ముగిసే వరకు మున్సిపల్, పోలీస్ శాఖలు సమన్వయంతో నిరంతరం పర్యవేక్షించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఉత్సవాల పర్యవేక్షణ, వివిధ శాఖల మధ్య సమన్వయం కోసం ప్రత్యేక అధికారులను నియమించాలని సూచించారు. శాసనసభ ఆవరణలోని మండలి సమావేశ మందిరంలో గణేశ్ ఉత్సవ ఏర్పాట్లపై నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో సీఎం సమీక్షించారు. గణేశ్ ఉత్సవాల పర్యవేక్షణకు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. హైదరాబాద్ ప్రశాంతంగా ఉన్నప్పుడే పెట్టుబడులు వస్తాయని, ఉత్సవాల సందర్భంగా శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. గణేశ్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలు సాఫీగా సాగేందుకు నిర్వాహకులు ప్రభుత్వ యంత్రాంగానికి పూర్తి సహకారం అందించాలని కోరారు. ఉత్సవాలకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఎదురైనా పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గణేశ్ ఉత్సవాలకు సంబంధించి గత సంప్రదాయాన్ని పునరుద్ధరించామని సీఎం తెలిపారు. నిర్వాహకుల సమస్యలను స్వయంగా తెలుసుకునేందుకే తాను సమీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

### అతిథుల వివరాలు ముందే చెప్పాలి

గణేశ్ మండపాలకు ప్రముఖులు, అతిథులను ఆహ్వానించిన సందర్భాల్లో వారి వివరాలను ముందుగానే స్థానిక పోలీస్ కమిషనరేట్‌కు అందించాలని నిర్వాహకులకు సీఎం సూచించారు. దీనివల్ల అవసరమైన ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవడంతో పాటు అనుకోని పరిణామాలు ఎదురైనా ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టేందుకు వీలవుతుందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో గణేశ్ మండపాలకు ఉచితంగా విద్యుత్ అందిస్తున్నామని రేవంత్‌రెడ్డి తెలిపారు. అయితే మండప నిర్వాహకులు సంబంధిత అధికారులకు దరఖాస్తు చేసుకుని ఉచిత విద్యుత్ సదుపాయాన్ని పొందాలని సూచించారు. మండపాలను ఎక్కడెక్కడ ఏర్పాటు చేస్తున్నారనే సమాచారాన్ని ముందుగానే పోలీసులకు అందిస్తే ట్రాఫిక్, బందోబస్తు నిర్వహణ సులభమవుతుందని చెప్పారు.

### చెరువుల వద్ద క్రేన్లకు ప్రత్యేక ఏర్పాట్లు

అభివృద్ధి చేస్తున్న చెరువుల వద్ద బతుకమ్మలకు ఏర్పాటు చేసిన తరహాలోనే గణేశ్ నిమజ్జనాలకు అవసరమైన సదుపాయాలను నిర్మాణ దశలోనే కల్పించాలని సీఎం ఆదేశించారు. నిమజ్జన ప్రక్రియ సాఫీగా సాగేందుకు చెరువుల చుట్టూ క్రేన్లను ఏర్పాటు చేసుకునేలా ప్రత్యేక ప్రదేశాలు, అవసరమైన మౌలిక సదుపాయాలను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, మహమ్మద్ అజారుద్దీన్, ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, నగర ప్రజాప్రతినిధులు, జీహెచ్ఎంసీ, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్, హైడ్రా కమిషనర్లు, పోలీసు ఉన్నతాధికారులు, గణేశ్ ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఒక్క క్లిక్‌తో హైడ్రా సేవలు

## అందుబాటులోకి అధికారిక వెబ్‌సైట్

## అత్యవసర సహాయం నుంచి చెరువుల వివరాల దాకా

## వర్షపాతం.. వరద ప్రాంతాలకు ప్రత్యేక మ్యాప్‌లు

## అగ్నిమాపక అనుమతులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు



**హైదరాబాద్, సెప్టెంబర్ 12 (సమయం న్యూస్):** హైదరాబాద్ నగరంలో విపత్తు నిర్వహణ, చెరువులు, ప్రభుత్వ భూముల పరిరక్షణకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు మరింత చేరువ చేసేందుకు హైడ్రా కీలక అడుగు వేసింది. ప్రజలకు పలు రకాల సేవలను ఒకే వేదికపై అందించే అధికారిక వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. హైడ్రా కమిషనర్ రంగనాథ్ శుక్రవారం కొత్త పోర్టల్‌ను ప్రారంభించారు. హైడ్రా సేవలు, కార్యకలాపాలు, అత్యవసర సహాయం, వాతావరణ పరిస్థితులు, చెరువులు, భూములు, అధికార పరిధి తదితర వివరాలను ఇకపై ఒకే చోట తెలుసుకోవచ్చు. చెరువుల హద్దులు, కాలువలు, ప్రభుత్వ భూములు, విపత్తు నిర్వహణకు సంబంధించిన సమాచారంతోపాటు హైడ్రా అధికారిక ప్రకటనలు, క్షేత్రస్థాయి కార్యక్రమాలు, చెరువుల పునరుద్ధరణ వివరాలను పోర్టల్‌లో పొందుపరిచారు.

### అత్యవసరమైతే 1070

హైడ్రా 24 గంటల అత్యవసర సహాయ సంఖ్య 1070ను పోర్టల్‌లో ప్రత్యేకంగా అందుబాటులో ఉంచారు. చెట్లు కూలడం, అగ్ని ప్రమాదాలు, రహదారులపై నీరు నిలవడం, వరదలు, సహాయక చర్యలు అవసరమైన సందర్భాలతోపాటు ఇతర విపత్తులపై ప్రజలు ఈ నంబర్‌కు సమాచారం అందించవచ్చు. అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించేందుకు ఇది ఉపయోగపడనుంది. అగ్నిమాపక భద్రత నిరభ్యంతర పత్రాల కోసం కూడా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే సదుపాయం కల్పించారు. భవన యజమానులు, నిర్మాణదారులు దరఖాస్తు చేయడంతోపాటు అది ఏ దశలో ఉందో తెలుసుకోవచ్చు. అధికారులు ప్రత్యేక డ్యాష్‌బోర్డు ద్వారా దరఖాస్తులను పరిశీలించి తదుపరి చర్యలు చేపట్టే అవకాశం ఉంటుంది.

### వరద ప్రాంతాలు ముందే తెలుసుకోవచ్చు

భారీ వర్షాలు, వరదల సమయంలో నీరు నిలిచే ప్రాంతాలను ముందుగానే గుర్తించేందుకు ప్రత్యేక మ్యాప్‌లను పోర్టల్‌లో పొందుపరిచారు. జీహెచ్ఎంసీ, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నీరు నిలిచే, వరద ప్రభావానికి గురయ్యే ప్రాంతాలను వేర్వేరుగా పరిశీలించవచ్చు. ప్రత్యక్ష వర్షపాతం మ్యాప్‌లు, రోజువారీ వర్షపాతం వివరాలు, వాతావరణ అంచనాలు, హైదరాబాద్ డాప్లర్ రాడార్ సమాచారాన్ని కూడా అందుబాటులో ఉంచారు. భారీ వర్షాల సమయంలో ఎప్పటికప్పుడు పరిస్థితిని తెలుసుకునేందుకు ఇవి ఉపయోగపడనున్నాయి.

### చెరువుల హద్దులు.. భూముల వివరాలూ

హైడ్రా వెబ్‌సైట్ నుంచి హెచ్ఎండీఏ చెరువుల పోర్టల్‌కు నేరుగా వెళ్లే సదుపాయం కల్పించారు. చెరువులు, జలాశయాలకు సంబంధించిన పూర్తి నీటిమట్టం హద్దులు, బఫర్ జోన్ వివరాలను పరిశీలించవచ్చు. చెరువుల పరిసరాల్లో నిర్మాణాలు చేపట్టే ముందు వర్తించే నిబంధనలను తెలుసుకునేందుకు ఈ సమాచారం ఉపయోగపడుతుంది. తెలంగాణ ప్రభుత్వ భూభారతి పోర్టల్‌కు కూడా నేరుగా అనుసంధానం కల్పించారు. భూముల కొనుగోలు లేదా ఇతర లావాదేవీలకు ముందు సర్వే నంబర్, పట్టాదారు వివరాల ఆధారంగా అందుబాటులో ఉన్న భూ రికార్డులను పరిశీలించుకునే అవకాశం ఉంటుంది. హైడ్రా పునరుద్ధరించిన చెరువులు, చేపట్టిన పరిరక్షణ కార్యక్రమాలు, క్షేత్రస్థాయి పనుల తాజా సమాచారాన్ని కూడా పోర్టల్‌లో పొందుపరిచారు. వార్తలు, తాజా సమాచారం, ఫొటోలు, వీడియోల ద్వారా హైడ్రా కార్యకలాపాలను ప్రజలు ఎప్పటికప్పుడు తెలుసుకునేలా ఏర్పాట్లు చేశారు.

# దసరా కానుకగా కొత్త పింఛన్లు

## దసరా కానుకగా కొత్త పింఛన్లు

## రాష్ట్రవ్యాప్తంగా 2.50 లక్షల మందికి అవకాశం

## ఇంటింటికీ వెళ్లి అర్హుల పరిశీలన

## ఈ నెలాఖరులోగా క్షేత్రస్థాయి తనిఖీలు

## వచ్చే నెల తొలివారంలో తుది జాబితా

## ప్రభుత్వం ఆమోదించగానే పింఛన్ సొమ్ము పంపిణీ

**హైదరాబాద్, సెప్టెంబర్ 12 (సమయం న్యూస్):** తెలంగాణలో కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న వారికి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 2.50 లక్షల పింఛన్లు మంజూరు చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం.. దసరా కానుకగా వాటిని పంపిణీ చేసేందుకు సిద్ధమవుతోంది. ఇప్పటికే దరఖాస్తుల స్వీకరణ చేపట్టగా, లక్షల సంఖ్యలో వచ్చిన దరఖాస్తుల్లో అర్హులను గుర్తించే ప్రక్రియ కొనసాగుతోంది. దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్లకు అధికారులు నేరుగా వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నారు. కుటుంబ పరిస్థితి, ఆదాయం, ఇతర అర్హతలను తనిఖీ చేయనున్నారు. ఈ నెలాఖరులోగా పరిశీలన ప్రక్రియను పూర్తి చేసి, వచ్చే నెల తొలి వారంలో అర్హుల తుది జాబితాను సిద్ధం చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రభుత్వం ఆమోదం తెలిపిన అనంతరం దసరా నుంచి కొత్త పింఛన్ల సొమ్ము అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. ఇందుకు అవసరమైన బడ్జెట్‌ను కూడా కేటాయించినట్లు తెలుస్తోంది.

### ఆగస్టు 9 నుంచి దరఖాస్తులు

కొత్త పింఛన్ల కోసం ఆగస్టు 9 నుంచి దరఖాస్తులను స్వీకరిస్తుండగా.. గడువును సెప్టెంబర్ 15 వరకు పొడిగించారు. తొలుత ఈ నెలలోనే పరిశీలన పూర్తి చేసి పింఛన్లు మంజూరు చేయాలని భావించినప్పటికీ క్షేత్రస్థాయి పరిశీలన, అవసరమైన ధ్రువీకరణ పత్రాల జారీలో ఎదురైన సమస్యల కారణంగా ప్రక్రియ ఆలస్యమైనట్లు సమాచారం. దివ్యాంగులు, డయాలసిస్ బాధితులు, ఫైలేరియా బాధితులు, చేనేత, గీత కార్మికులు, వితంతువులు, ఒంటరి మహిళల అర్హతలను నిర్ధారించేందుకు సంబంధిత పత్రాలు అవసరం. ఒంటరి మహిళలు విడాకులకు సంబంధించిన పత్రాలు, కోర్టు ఉత్తర్వులతోపాటు ఏడాదిగా ఒంటరిగా ఉంటున్నట్లు ధ్రువీకరణ సమర్పించాల్సి ఉంటుంది. వితంతువులు భర్త మరణ ధ్రువీకరణ పత్రాన్ని అందించాల్సి ఉంటుంది. అయితే భర్త మరణించి ఎక్కువకాలమైన వితంతువులు మరణ ధ్రువీకరణ పత్రాలు పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గీత, చేనేత కార్మికులు, ఫైలేరియా, డయాలసిస్ బాధితులు కూడా సంబంధిత శాఖల నుంచి ధ్రువీకరణ పత్రాలు పొందడంలో సమస్యలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో.. ప్రాథమికంగా ధ్రువీకరణ పత్రాలు లేకుండానే దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. తర్వాత జరిగే అర్హతల పరిశీలన సమయంలో మాత్రం అవసరమైన పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది.




### ప్రస్తుతానికి 2.50 లక్షల మందికే..

ప్రస్తుతం 2.50 లక్షల కొత్త పింఛన్లకు మాత్రమే ప్రభుత్వం ఆమోదం తెలిపిన నేపథ్యంలో అంతమంది అర్హులనే ఎంపిక చేయనున్నారు. వచ్చిన దరఖాస్తుల్లో పూర్తి అర్హతలు ఉన్నవారిని ప్రాధాన్యత క్రమంలో ఎంపిక చేయనున్నారు. అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన పూర్తిచేసి తుది జాబితాను ప్రభుత్వానికి పంపనున్నారు. ప్రభుత్వం ఆమోదం తెలిపిన తర్వాత పింఛన్ల పంపిణీ ప్రారంభం కానుంది. దీర్ఘకాలంగా కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న నేపథ్యంలో దసరా నుంచి పింఛన్లు అందనున్నాయన్న సమాచారంతో అర్హుల్లో ఆశలు పెరిగాయి.

# తెలంగాణకు మరో వారం వానలే!

## రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు

## 24 గంటల్లో పలుచోట్ల భారీ వర్షాలకు అవకాశం

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచన

**హైదరాబాద్, సెప్టెంబర్ 12 (సమయం న్యూస్):** తెలంగాణలో వర్షాల ఉద్ధృతి ఇప్పట్లో తగ్గే సూచనలు కనిపించడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా మరో వారం రోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. రానున్న 24 గంటల్లో పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరికలు జారీ చేసింది. ముఖ్యంగా ములుగు, జయశంకర్ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, ఆదిలాబాద్, కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. నిర్మల్, జగిత్యాల, నిజామాబాద్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లోనూ భారీ వర్షాలకు అవకాశం ఉందని తెలిపింది. నల్గొండ, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, నారాయణపేట, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట జిల్లాల్లో అక్కడక్కడా మోస్తరు వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయి. హైదరాబాద్ నగరంలోనూ మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం పేర్కొంది. వర్షాల నేపథ్యంలో ఉష్ణోగ్రతలు తగ్గడం, గాలిలో తేమ శాతం పెరగడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని రాష్ట్ర ప్రజారోగ్య శాఖ హెచ్చరించింది. ప్రధానంగా దోమలు, కలుషిత నీరు, గాలి ద్వారా వ్యాపించే అంటువ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. దోమతెరలు ఉపయోగించడం, నివాస పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం, కాచి చల్లార్చిన నీటినే తాగడం వంటి ముందస్తు జాగ్రత్తలు పాటించాలని కోరింది. ఫ్లూ లక్షణాలు కనిపిస్తే జాప్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని అధికారులు సూచించారు.

# తెలంగాణ భవన్‌లో మాక్ అసెంబ్లీ

- సస్పెన్షన్లకు నిరసనగా బీఆర్ఎస్ నమూనా సభ
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై సెటైర్ల వర్షం!
- స్పీకర్‌గా జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు
- 'సీఎం' పాత్రలో తలసాని శ్రీనివాస్ యాదవ్
- కొండా సురేఖ తొలగింపుపై వ్యంగ్యాస్త్రాలు
- వంద రోజుల హామీలపైనా చురకలు





**హైదరాబాద్, సెప్టెంబర్ 12 (సమయం న్యూస్):** అసెంబ్లీ నుంచి తమ ఎమ్మెల్యేల సస్పెన్షన్‌ను నిరసిస్తూ బీఆర్ఎస్ వినూత్న నిరసనకు దిగింది. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శనివారం 'మాక్ అసెంబ్లీ' నిర్వహించింది. కాంగ్రెస్ ప్రభు త్వం, సీఎం రేవంత్‌రెడ్డి తీరును లక్ష్యంగా చేసుకుని బీఆర్ ఎస్ నేతలు వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ప్రభుత్వం చర్చకు అనుమతించడం లేదని ఆరోపిస్తూ పలు ప్రజా సమస్యలను నమూనా సభలో ప్రస్తావించారు. ఈ మాక్ అసెంబ్లీలో జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు స్పీకర్‌గా వ్యవహరించగా.. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సీఎం పాత్ర పోషించారు. రేవంత్‌రెడ్డి మాట్లాడే తీరును అనుకరిస్తూ ప్రభుత్వంపై సెటైర్లు వేశారు. ఇటీవల మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తొలగించిన అంశాన్ని ప్రస్తావించిన తల సాని.. ఆమె కుమార్తె తన గురించి మాట్లాడినందుకే ఢిల్లీ వెళ్లి 3 రోజులు ఉండి సురేఖను అణచివేసి వచ్చానన్నట్లుగా వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. తాను బీసీ బిడ్డనై సీఎం అయ్యాక ఆమెను మంత్రివర్గం నుంచి తొలగించకుండా ఏం చేయగలనంటూ రేవంత్‌ను అనుకరిస్తూ ఎద్దేవా చేశారు.

### 'ఏ వంద రోజుల్లోనో చెప్పామా?'

కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ప్రకటించిన వంద రోజుల హామీల అమలుపైనా తలసాని చురకలంటించారు. "వంద రోజుల్లో హామీలు అమలు చేస్తామని చెప్పాం.. కానీ ఏ వంద రోజుల్లో అని చెప్పామా? ఢిల్లీలో మాకూ కొన్ని ఇబ్బందులు ఉంటాయి కదా" అంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. తమ పార్టీ మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసుల ప్రవర్తన, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆరోగ్యంపై కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేసిన వ్యాఖ్యలపై సభలో చర్చ జరపాలని పట్టుబట్టిన నేపథ్యంలో సెప్టెంబర్ 9న కేటీఆర్‌తో సహా 22 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సస్పెండ్ చేశారు. ఈ నిర్ణయాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ మాక్ అసెంబ్లీ నిర్వహించింది. కేటీఆర్‌తోపాటు పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అసెంబ్లీలో ప్రభుత్వం చర్చకు అవకాశం ఇవ్వడం లేదని ఆరోపిస్తూ వివిధ ప్రజా సమస్యలతో కూడిన ప్లకార్డులను

# ఆదిలాబాద్ విమానాశ్రయ పనులు వేగవంతం

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడి
- రాజ్‌నాథ్ సింగ్, రామ్మోహన్ నాయుడుతో భేటీ



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12:** ఉత్తర తెలంగాణ ప్రజల చిరకాల స్వప్నమైన ఆదిలాబాద్ విమానాశ్రయ ప్రాజెక్టు పనులు వేగవంతం అయ్యాయని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. వాణిజ్యపరంగా, వ్యూహాత్మకంగా కీలకమైన ఈ ప్రాజెక్టు పురోగతిపై ఢిల్లీలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుతో ఆయన చర్చించారు. ఈ భేటీలో ఆదిలాబాద్‌లో జాయింట్ యూజర్ ఎయిర్‌ఫీల్డ్ అభివృద్ధికి రక్షణ మంత్రిత్వ శాఖ సంపూర్ణ సమ్మతి తెలిపినట్లు కిషన్ రెడ్డి వెల్లడించారు. ప్రాజెక్ట్ పురోగతిని వేగవంతం చేసేందుకు రక్షణ శాఖ, పౌర విమానయాన శాఖ, తెలంగాణ ప్రభుత్వాల నుంచి వచ్చే వారంలోగా ఒక్కో నోడల్ అధికారిని నియమించాలని నిర్ణయించినట్టు తెలిపారు. డీపీఆర్, మాస్టర్ ప్లాన్ రూపకల్పన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని నిర్ణయించామని చెప్పారు. గత ఏప్రిల్ 17న అధికారుల బృందం క్షేత్రస్థాయి స్థలాన్ని పరిశీలించి 2.75 కిలోమీటర్ల రన్‌వే నిర్మాణానికి ఆమోదం తెలిపిందని కిషన్ రెడ్డి గుర్తుచేశారు. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ వద్ద ఉన్న 369.45 ఎకరాలకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం మరో 1,500 ఎకరాల భూమిని సేకరించనుందని తెలిపారు. ఇక్కడ ఎయిర్‌ఫోర్స్ శిక్షణా కేంద్రాలు, హ్యాంగర్లతో పాటు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పౌర విమానాల సివిల్ టెర్మినల్, మెయింటెనెన్స్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు.

# మాక్ అసెంబ్లీ.. డెమోక్రసీని మాక్ చేయడమే

### పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



**హైదరాబాద్, సెప్టెంబర్ 12 (సమయం న్యూస్):** బీఆర్ఎస్ నిర్వహించిన మాక్ అసెంబ్లీ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా ఉందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క విమర్శించారు. చట్టసభల పట్ల, ప్రజాస్వామ్య వ్యవస్థల పట్ల ఆ పార్టీకి ఏ మాత్రం గౌరవం లేదనేది వారి చర్యలతో మరోసారి స్పష్టమైందన్నారు. అసెంబ్లీ లాబీలో మంత్రి సీతక్క శనివారం చిట్ చాట్ చేశారు. ఎర్రవల్లిలో ఎల్పీ సమావేశం నిర్వహించిన బీఆర్ఎస్ నేతలు పార్టీ కార్యాలయంలో మాక్ అసెంబ్లీ నిర్వహించాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. అసెంబ్లీకి రావాల్సిన నేతలు పార్టీ కార్యాలయంలో కూర్చుని అసెంబ్లీని అనుకరించడం ప్రజాస్వామ్యాన్ని గౌరవించడమా అని నిలదీశారు. గతంలో ఫామ్‌హౌస్ ముందు దళిత సంఘాలు నిరసన తెలిపినప్పుడు పసుపు నీళ్లతో ఆ ప్రాంతాన్ని శుద్ధి చేసిన ఘటనను మంత్రి సీతక్క గుర్తు చేశారు. ఇంకా ఆ మైల పోలేదనే ఆధిపత్య దురహంకారంతోనే ఫామ్‌హౌస్‌లో మాక్ అసెంబ్లీ నిర్వహించలేదా అని ప్రశ్నించారు. అసెంబ్లీకి ఎలాగూ రాని కేసీఆర్ బీఆర్ఎస్ నిర్వహించిన మాక్ అసెంబ్లీకి కూడా రాకపోవడం చూస్తుంటే ఆయనకు చట్టసభల పట్ల, సొంత పార్టీ కార్యక్రమాల పట్ల ఎంత గౌరవం ఉందో అర్థమవుతోందని సీతక్క అన్నారు. కేసీఆర్ అధికారంలో ఉంటే సచివాలయానికి రారు.. ప్రతిపక్షంలో ఉంటే అసెంబ్లీకి రారు అని ఆమె ఎద్దేవా చేశారు. ఫామ్‌హౌస్‌ను సచివాలయంగా, పార్టీ కార్యాలయాన్ని అసెంబ్లీగా భావించే పార్టీ బీఆర్ఎస్ తప్ప దేశంలో మరొకటి లేదని విమర్శించారు. ఫామ్‌హౌస్‌లో ఎల్పీ సమావేశం.. పార్టీ కార్యాలయంలో అసెంబ్లీ సమావేశం.. ఉన్న దగ్గరకే అన్నీ రావాలనుకోవడం దొరల అహంకారానికి నిదర్శనం.. చింత చచ్చినా పులుపు చావలేదన్నట్లు అధికారం పోయినా దొర అహంకారం మాత్రం ఇంకా పోలేదు అని సీతక్క మండిపడ్డారు. ప్రజలు ఎన్నుకున్న అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై చర్చించాల్సిన బాధ్యత ప్రతిపక్ష పార్టీకి ఉందన్నారు. స్పీకర్‌ను, చట్టసభలను అవమానిస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న బీఆర్ఎస్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని, ప్రతిపక్ష హోదాను ఊడగొట్టడం ఖాయమని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

# 'రీయింబర్స్‌మెంట్‌పై దాటవేత తగదు'

### 15 వేల కోట్ల బకాయిలు ఎప్పుడిస్తారో చెప్పాలి

### విద్యార్థుల ఖాతాల్లో నగదు జమ చేయాలి

### జీవో 97తో పాలిటెక్నిక్ వ్యవస్థకు ముప్పు

### విద్యార్థులపై లాఠీచార్జి అమానుషం

### బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ధ్వజం



**హైదరాబాద్, సెప్టెంబర్ 12 (సమయం న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకుండా విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని, దాటవేత ధోరణి వీడి బకాయిల చెల్లింపు తేదీని స్పష్టంగా ప్రకటించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు డిమాండ్ చేశారు. శనివారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన రూ.5,430 కోట్లతో పాటు వర్తమాన కాంగ్రెస్ పాలనలో పేరుకుపోయిన బకాయిలు కలిపి మొత్తం రూ.15 వేల కోట్లకు చేరాయని, దీనివల్ల కళాశాలలు సర్టిఫికెట్లు నిలిపివేయడంతో లక్షలాది మంది విద్యార్థులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాశాఖను తన వద్దే ఉంచుకున్న సీఎం రేవంత్ రెడ్డి ఆ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేశారని రామచందర్ రావు విమర్శించారు. జీవో 97 తీసుకొచ్చి పాలిటెక్నిక్ కోర్సులను ధ్వంసం చేసే కుట్ర జరుగుతోందని, న్యాయమైన డిమాండ్ల కోసం నిరసన తెలుపుతున్న పాలిటెక్నిక్ విద్యార్థులపై క్రూరంగా లాఠీఛార్జ్ చేయించడం అమానుషమని మండిపడ్డారు. విద్యార్థుల సమస్యలపై సేకరించిన 8 లక్షల వినతిపత్రాలను ఇచ్చేందుకు సమయం కోరితే సీఎం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వలేదని ఆరోపించారు. అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వానికి ఆకర్షితులై సూర్యాపేట, హైదరాబాద్ జిల్లాలకు చెందిన రిటైర్డ్ డీసీపీ శ్రీనివాస్ మరియు పలువురు వైద్యులు, ప్రముఖులు బీజేపీలో చేరగా, రామచందర్ రావు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



# క్యూర్ బిల్లుకు మండలి ఆమోదం

### కోర్ అర్బన్ రీజియన్ 2026 బిల్లుకు గ్రీన్‌సిగ్నల్

### హైదరాబాద్ అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వ నిర్ణయం

**హైదరాబాద్, సెప్టెంబర్ 12 (సమయం న్యూస్):** హైదరాబాద్ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం తీసుకొచ్చిన క్యూర్ (కోర్ అర్బన్ రీజియన్) 2026 బిల్లుకు తెలంగాణ శాసనమండలి ఆమోదం తెలిపింది. శనివారం మండలిలో బిల్లును ప్రవేశపెట్టగా.. సభ్యులు చర్చించిన అనంతరం ఆమోదించారు. అనంతరం శాసనమండలి నిరవధికంగా వాయిదా పడింది. హైదరాబాద్ నగర అభివృద్ధి, పరిపాలనను మరింత సమర్థంగా నిర్వహించాలనే ఉద్దేశంతో క్యూర్ 2026 బిల్లును ప్రభుత్వం రూపొందించింది. 'ఒకే నగరం.. ఒకే పరిపాలన.. ఒకే చట్టం' అనే విధానంతో బిల్లుకు రూపకల్పన చేసినట్టు ప్రభుత్వం తెలిపింది. శనివారం జరిగిన మండలి సమావేశంలో క్యూర్ బిల్లుతోపాటు మొత్తం నాలుగు బిల్లులకు సభ్యులు ఆమోదం తెలిపారు. వివిధ అంశాలపై చర్చించిన అనంతరం బిల్లులకు మండలి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అనంతరం సభను నిరవధికంగా వాయిదా వేశారు. తెలంగాణ శాసనమండలి మొత్తం ఆరు రోజుల పాటు కార్యకలాపాలు నిర్వహించింది. ఈ కాలంలో 19 గంటల 20 నిమిషాల పాటు సభ కొనసాగినట్లు ప్రభుత్వం అధికారికంగా వెల్లడించింది.

### 22ఏ నిషేధిత భూముల వివాదంపై శాసనసభలో

# మంత్రి పొంగులేటి స్పష్టత

### ఉమ్మడి రాష్ట్రం నుంచే 22ఏ సమస్య

### ఆన్‌లైన్ అప్‌లోడ్‌లో దొర్లిన పొరపాట్లను సరిదిద్దాం



**హైదరాబాద్, సెప్టెంబర్ 12:** రాష్ట్రంలో 22ఏ నిషేధిత భూముల జాబితాపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలు కేవలం అసత్య ప్రచారమేనని, 22ఏ సమస్య ఈనాటిది కాదని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శాసనసభ వేదికగా స్పష్టం చేశారు. శనివారం శాసనసభలో 22ఏ అంశంపై జరిగిన సుదీర్ఘ చర్చలో ప్రతిపక్షాల ఆరోపణలను ఆయన ఆధారాలు, వీడియో క్లిప్పింగ్స్‌తో ఖండించారు. 2007లో ఉమ్మడి రాష్ట్రంలోనే 22ఏ అమల్లోకి వచ్చిందని, గత బిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాటు పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేయడం వల్లే సమస్య సజీవంగా ఉందన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు 2025 డిసెంబర్ 3న డేటా అప్‌లోడ్ చేసే సమయంలో కొన్ని సాంకేతిక పొరపాట్లు జరిగిన మాట వాస్తవమేనని, అయితే వాటిని ప్రభుత్వం తక్షణమే గుర్తించి సరిదిద్దిందని వివరించారు. కూకట్‌పల్లి పరిధిలోని హైదర్‌నగర్ (సర్వే నం. 145, 163, 172), శంషీగూడ (సర్వే నం. 57) వంటి ప్రాంతాలు సుప్రీంకోర్టు మరియు హైకోర్టుల్లో కేసులు పెండింగ్‌లో ఉన్నందున 2013 నుంచే పీవోబీ జాబితాలో ఉన్నాయని, కొత్తగా ఏ ఒక్క పట్టా భూమిని ఇందులో చేర్చలేదని మంత్రి ఆధారాలతో నిరూపించారు. 2023 డిసెంబర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చేనాటికి 22ఏ పరిధిలో 1,02,52,690 ఎకరాలు ఉండగా, నేటికి ఆ విస్తీర్ణం 1,02,05,250 ఎకరాలకు (47,440 ఎకరాలు) తగ్గిందని వెల్లడించారు. 22ఏ వల్ల రిజిస్ట్రేషన్ల రాబడి తగ్గిందనడం అవాస్తవమని, గతేడాదితో పోలిస్తే ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు ప్రభుత్వానికి రూ.1,359 కోట్ల మేర రిజిస్ట్రేషన్ల ఆదాయం పెరిగిందని గణాంకాలతో వివరిస్తూ, త్వరలోనే సమస్యలన్నింటినీ పూర్తిగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

### డిసెంబర్ 2027 నాటికి నాగపూర్-వరంగల్

# గ్రీన్‌ఫీల్డ్ హైవే పూర్తి

### మంత్రి కోమటిరెడ్డి



**హైదరాబాద్, సెప్టెంబర్ 12 (సమయం న్యూస్):** తెలంగాణ, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను అనుసంధానించే అత్యంత కీలకమైన నాగ్‌పూర్ - మంచిర్యాల - వరంగల్ - ఖమ్మం - విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణాన్ని 2027 డిసెంబర్ 31 నాటికి పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెల్లడించారు. శనివారం శాసనమండలిలో సభ్యులు పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, ప్రొఫెసర్ కోదండరామ్ అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. మొత్తం 310 కిలోమీటర్ల నిడివి ఉన్న ఈ భారీ రహదారి ప్రాజెక్టులో 280 కిలోమీటర్ల మేర తెలంగాణ పరిధిలోనే విస్తరించి ఉందని వివరించారు. భూసేకరణ, కోర్టు వివాదాల కారణంగా పనుల్లో కొంత ఆలస్యం జరిగిందని, అయితే ప్రస్తుతం ప్రధాన సమస్యలన్నింటినీ పరిష్కరించామని మంత్రి తెలిపారు. మార్కెట్ ధర ప్రకారం రైతులకు నష్టపరిహారం చెల్లిస్తున్నామని, కేవలం ఒకటి రెండు చోట్ల మాత్రమే 1 నుంచి 5 కిలోమీటర్ల పరిధిలో భూమి అప్పగింత పెండింగ్‌లో ఉందన్నారు. కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ కూడా ఇటీవల ఈ ప్రాజెక్టుపై ప్రత్యేక సమీక్ష జరిపారని గుర్తు చేశారు. జాతీయ రహదారుల

## సంపాదకీయం



# బ్రిక్స్‌కు కొత్త దిశ

## భారత్ చేతిలో భవిష్యత్ అజెండా!

## విశ్వశాంతి.. మానవ సంక్షేమమే లక్ష్యం

ప్రపంచ ఆర్థిక, రాజకీయ యవనికపై శరవేగంగా మారుతున్న సమీకరణల నడుమ భారత్ మరో చారిత్రక ఘట్టానికి ఆతిథ్యమిస్తోంది. ఢిల్లీ వేదికగా జరుగుతున్న 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు విశ్వశాంతి, ప్రపంచ మానవాళి సంక్షేమానికి సరికొత్త దిశను నిర్దేశించే వేదికగా మారుతోంది. ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్న వేళ ఆహారం, ఇంధనం, ఆరోగ్యం, విపత్తుల నిర్వహణ, కీలక సరఫరా వ్యవస్థల పరిరక్షణ లక్ష్యంగా రెండు రోజుల సదస్సు సాగుతోంది. సవాళ్లతో కూడిన ప్రపంచ పరిస్థితుల్లో బలమైన అనుసంధానకర్తగా తన నాయకత్వాన్ని చాటుకునేందుకు భారత్ ముందుకు సాగుతోంది. ఈ ఏడాది బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం చారిత్రాత్మకమైనదని ప్రధాని నరేంద్ర మోదీ అభివర్ణించారు. బ్రిక్స్ ఏర్పడి 20 ఏళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో కూటమి కొత్త దశలోకి అడుగుపెడుతోందన్నారు. మానవ జీవితంలో 20 ఏళ్ల వయసు పరిపక్వత, బాధ్యతలు పెరిగే దశకు సంకేతమైతే.. బ్రిక్స్ కూడా ఇప్పుడు పరిణతి దశకు చేరుకుందని వ్యాఖ్యానించారు. గత రెండు దశాబ్దాల్లో ప్రపంచ వేదికపై బ్రిక్స్ ప్రత్యేక గుర్తింపు సాధించిందన్నారు. బ్రిక్స్ ఎవరికీ వ్యతిరేకంగా పనిచేసే కూటమి కాదని, అందరినీ కలుపుకొని ముందుకు సాగడమే దాని విధానంగా ఉండాలని మోదీ స్పష్టం చేశారు. సభ్య దేశాల మధ్య ఐక్యత, ఏకాభిప్రాయాన్ని స్పష్టమైన ఫలితాలుగా మార్చాల్సిన సమయం వచ్చిందన్నారు. భారత్ అధ్యక్షత ప్రజా కేంద్రిత, 'మానవతా ప్రథమ' విధానం ఆధారంగా కొనసాగుతోందని చెప్పారు. సౌలభ్యం, ఆవిష్కరణ, సహకారం, స్థిరత్వం ప్రధాన ప్రాధాన్యతలని వెల్లడించారు. రాబోయే 20 ఏళ్లకు బ్రిక్స్ కొత్త, ప్రతిష్టాత్మక అజెండాతో ముందుకు సాగాలని ప్రతిపాదించారు. ప్రపంచ పాలనలో సంస్కరణలు, గ్లోబల్ సౌత్‌కు సముచిత ప్రాతినిధ్యం, అంతర్జాతీయ ఆర్థిక సంస్థల్లో మార్పులు ఈ ప్రయాణంలో కీలకంగా ఉండాలని పేర్కొన్నారు. ప్రపంచ పాలనా వ్యవస్థలో సంస్కరణలకు సమగ్ర మార్గపటం రూపొందించాలని మోదీ సూచించారు. ప్రాతినిధ్యం, స్పందన–జవాబుదారీతనం, నియమాల రూపకల్పన అనే మూడు అంశాలు దీనికి ప్రాతిపదికగా ఉండాలన్నారు. ప్రపంచ వ్యవస్థలో అన్ని దేశాలకు సముచిత ప్రాతినిధ్యం దక్కాలని, నిర్ణయాలు తీసుకునే ప్రక్రియ మరింత సమగ్రంగా ఉండాలని అభిప్రాయపడ్డారు. ప్రపంచ పరిస్థితులు మారుతున్నప్పటికీ అంతర్జాతీయ సంస్థల్లో ప్రాతినిధ్య వ్యవస్థ మాత్రం అందుకు అనుగుణంగా మారడం లేదన్నారు. ప్రస్తుత ప్రపంచ వాస్తవాలకు అనుగుణంగా అంతర్జాతీయ సంస్థలను సంస్కరించాల్సిన సమయం ఆసన్నమైందని స్పష్టం చేశారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి సంస్కరణలను ఇకపై వాయిదా వేయకూడదని మోదీ పిలుపునిచ్చారు. ఈ అంశంపై చర్చలు కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా నిర్దిష్ట కాలపరిమితి, స్పష్టమైన ఫలితాలతో ముందుకు సాగాలని సూచించారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థను ముందుకు నడిపిస్తున్న దేశాలకు అంతర్జాతీయ ఆర్థిక పాలనలోనూ తగిన పాత్ర దక్కాలన్నారు. అంతర్జాతీయ ఆర్థిక సంస్థల్లో ఓటింగ్ హక్కులు, నాయకత్వ పదవులు, విధాన ప్రాధాన్యతలు నేటి ఆర్థిక వాస్తవాలకు అనుగుణంగా మారాల్సిన అవసరం ఉందని చెప్పారు. ప్రపంచ ఆర్థిక వృద్ధికి కీలకంగా ఉన్న దేశాలకు ప్రపంచ ఆర్థిక పాలనా వ్యవస్థ రూపకల్పనలోనూ సముచిత స్థానం ఉండాలని స్పష్టం చేశారు. ప్రతి ఏడాది బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలు మారుతున్నప్పటికీ సంస్థాగత కార్యక్రమాల వేగం తగ్గకూడదని మోదీ పేర్కొన్నారు. ఇందుకోసం 'కొనసాగింపు--అమలు యంత్రాంగం' ఏర్పాటు చేయాలని భారత్ ప్రతిపాదిస్తున్నట్లు తెలిపారు. బ్రిక్స్ కార్యక్రమాలు, నిర్ణయాలు, వాటి ఫలితాలను ట్రోయికా ద్వారా నిరంతరం పర్యవేక్షించవచ్చని సూచించారు. తద్వారా ఒక అధ్యక్ష దేశం నుంచి మరో దేశానికి బాధ్యతలు మారినా గత నిర్ణయాల అమలులో కొనసాగింపు ఉంటుందని అభిప్రాయపడ్డారు. ప్రపంచ సంక్షోభాల ప్రభావాన్ని గ్లోబల్ సౌత్ దేశాలు ముందువరుసలో ఎదుర్కొంటున్నప్పటికీ.. అంతర్జాతీయ నిర్ణయాల ప్రక్రియలో మాత్రం అవి వెనుకబడి ఉన్నాయని ప్రధాని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితి మారాలని స్పష్టం చేస్తూ 'విశేషాధికారాల పిరమిడ్‌ను భాగస్వామ్య వేదికగా మార్చాలి' అని పిలుపునిచ్చారు. ప్రతి దేశం గొంతు వినిపించేలా, ప్రతి సభ్యుడికీ భాగస్వామ్యం ఉండేలా ప్రపంచ వ్యవస్థ మారాలని పేర్కొన్నారు. అంతర్జాతీయ నిర్ణయాల్లో మానవాళి అభివృద్ధినే కేంద్రంగా ఉంచాలని స్పష్టం చేశారు. రెండు దశాబ్దాల బ్రిక్స్ ప్రయాణాన్ని కొత్త దశగా అభివర్ణించిన మోదీ.. రాబోయే 20 ఏళ్లలో కూటమిని మరింత ప్రభావవంతమైన, సమగ్ర, ఫలితాల ఆధారిత వేదికగా తీర్చిదిద్దేందుకు భారత్ తరఫున కీలక ప్రతిపాదనలు ముందుంచారు. ముఖ్యంగా ఐరాస సహా అంతర్జాతీయ సంస్థల్లో సంస్కరణలు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో మార్పులు, గ్లోబల్ సౌత్‌కు సముచిత ప్రాతినిధ్యం, తీసుకున్న నిర్ణయాల నిరంతర అమలుకు ప్రత్యేక యంత్రాంగం వంటి అంశాలు ఆయన ప్రసంగంలో ప్రధానంగా నిలిచాయి. ఆహారం నుంచి ఇంధనం వరకు.. ఆరోగ్యం నుంచి విపత్తుల నిర్వహణ వరకు.. సరఫరా వ్యవస్థల పరిరక్షణ నుంచి ప్రపంచ పాలనా సంస్కరణల వరకు విస్తృత అజెండాతో సాగుతున్న ఈ సదస్సుపై అంతర్జాతీయంగా ఆసక్తి నెలకొంది. బ్రిక్స్ రెండో రోజు తీసుకునే నిర్ణయాలు, వెలువడే కార్యాచరణ ప్రపంచ రాజకీయ, ఆర్థిక సమీకరణాలకు ఎలాంటి కొత్త దిశను చూపుతాయన్నదే ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# బ్రిక్స్‌లో 'న్యూఢిల్లీ' ఏకతాటిపై!

- సంయుక్త ప్రకటనకు సభ్య దేశాల ఏకగ్రీవ ఆమోదం
- యుద్ధం కాదు.. చర్చలు, దౌత్యమే మార్గమని స్పష్టీకరణ
- ఐరాస భద్రతా మండలిలో సంస్కరణలకు పిలుపు
- మానవాభివృద్ధికే అగ్రతాంబూలమన్న ప్రధాని మోదీ
- ప్రపంచ నేతలతో వరుస ద్వైపాక్షిక భేటీలు




**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12 (సమయం న్యూస్):** భారత్ ఆతిథ్యమిస్తున్న 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో కీలక పరిణామం చోటుచేసుకుంది. సభ్య దేశాల మధ్య భిన్నాభిప్రాయాలను అధిగమిస్తూ 'న్యూఢిల్లీ డిక్లరేషన్'కు ఏకాభిప్రాయం కుదిరింది. తొలుత సంయుక్త ప్రకటనపై సభ్య దేశాలు ఒక అవగాహనకు వచ్చినట్లు వార్తలు వెలువడగా.. అనంతరం కూటమిలోని దేశాలన్నీ దానికి ఏకగ్రీవంగా ఆమోదం తెలిపాయి. పశ్చిమాసియా సంక్షోభంతోపాటు అంతర్జాతీయ వివాదాలకు యుద్ధం పరిష్కారం కాదని, చర్చలు, దౌత్య మార్గాల ద్వారానే శాంతిని సాధించాలని బ్రిక్స్ దేశాలు స్పష్టం చేశాయి. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న యుద్ధాలు, ముఖ్యంగా పశ్చిమాసియా పరిణామాలపై సభ్య దేశాల మధ్య భిన్నమైన వైఖరులు ఉన్నప్పటికీ సంయుక్త ప్రకటనపై ఏకాభిప్రాయం సాధించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఏ ఒక్క దేశాన్ని ప్రత్యేకంగా లక్ష్యంగా చేసుకోకుండా.. ఏకపక్ష యుద్ధ చర్యలను ఖం డించే అంశాన్ని ప్రకటనలో పొందుపరిచినట్లు సమాచారం. ఇరాన్, యూఏఈ రెండూ బ్రిక్స్ సభ్య దేశాలే అయినప్పటికీ ప్రస్తుత గల్ఫ్ సంక్షోభంలో వాటి వైఖరులు భిన్నంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇరువర్గాలూ అంగీకరించే భాషను ప్రకటనలో పొందుపరచడం దౌత్యపరంగా సవా లుగా మారింది. ఇరాన్, యూఏఈతో భారత్‌కు సత్సం బంధాలు ఉ ండటంతో అధ్యక్ష దేశంగా విభేదాలను అధి గమించి ఏకాభిప్రాయం సాధించే దిశగా భారత్ చర్చలను ముందుకు నడిపినట్లు సమాచారం.

### యుద్ధం కాదు.. దౌత్యమే మార్గం

న్యూఢిల్లీ డిక్లరేషన్‌లో పశ్చిమాసియా సంక్షోభంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ.. అంతర్జాతీయ సమస్యలకు యుద్ధం పరిష్కారం కాదని సభ్య దేశాలు అభిప్రాయపడ్డాయి. నిరంతర చర్చలు, దౌత్య మార్గాల ద్వారానే శాంతి సాధ్యమని పేర్కొన్నాయి. ఏకపక్ష యుద్ధ చర్యలను ఖండిం చడంతోపాటు మారుతున్న ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో తక్షణ సంస్కరణలు చేపట్టాలని కోరాయి. ప్రపంచ సరఫరా వ్యవస్థలను బలోపేతం చేయడం, ఆహార–ఇంధన భద్రత, స్థానిక కరెన్సీల ద్వారా వాణిజ్యాన్ని పెంపొందించడం, డిజిటల్ సహకారాన్ని విస్తరించడం వంటి ఆర్థిక అంశాలపైనా ఏకాభిప్రాయం వ్యక్తమైంది. భారత్ అధ్యక్షతన 'మానవాభివృద్ధే ప్రథమం' అనే విధానంతో ప్రజల సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు.

### 'బ్రిక్స్ ఎవరికీ వ్యతిరేకం కాదు'

సదస్సును ఉద్దేశించి ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ.. బ్రిక్స్ కూటమి ఏ పాశ్చాత్య లేదా ఇతర వర్గానికి వ్యతిరేకంగా పనిచేసే వేదిక కాదని, అందరినీ కలుపుకొని ముందుకు సాగే భాగస్వామ్య వేదిక అని స్పష్టం చేశారు. బ్రిక్స్ ప్రయాణం రెండు దశాబ్దాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో సభ్య దేశాల ప్రజలకు విశ్వాసం, భరోసా కల్పించాల్సిన బాధ్యత కూటమిపై ఉందన్నారు. అంతర్జాతీయ సమస్యలు, సవాళ్లకు బ్రిక్స్ దేశాలు కార్యాచరణ ద్వారా పరిష్కారాలు చూపాలని పిలుపునిచ్చారు. కూటమి వేగంగా అభివృద్ధి చెందడంతోపాటు వేసే ప్రతి అడుగులో మానవాభివృద్ధికి అత్యున్నత ప్రాధాన్యం ఉండాలని పేర్కొన్నారు. గ్లోబల్ సౌత్ దేశాల స్వరాన్ని మరింత బలోపేతం చేయాలని, ఐరాస భద్రతా మండలితోపాటు ఇతర అంతర్జాతీయ సంస్థల్లో సమగ్ర సంస్కరణలు అవసరమని పునరుద్ఘాటించారు. బ్రిక్స్‌లో తీసుకున్న నిర్ణయాలు కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో అమలయ్యేందుకు ప్రత్యేకంగా 'కంటిన్యూటీ అండ్ ఇంప్లిమెంటేషన్ మెకానిజం' ఏర్పాటు చేయాలని మోదీ ప్రతిపాదించారు.

### 'అతిథి దేవో భవ'.. వెండి పాత్రల్లో భారతీయ రాజసం

సదస్సుకు హాజరైన విదేశీ అతిథులకు భారతీయ ఆతిథ్య సంప్రదాయాన్ని పరిచయం చేసేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. జైపూర్‌కు చెందిన అరుణ్స్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ప్రత్యేక వెండి టేబుల్‌వేర్, కట్లరీని రూపొందించింది. ప్రాచీన భారత రాజుల విందులను గుర్తుచేసే సంప్రదాయ డిజైన్లతో వీటిని తీర్చిదిద్దారు. భారతీయ, చైనీస్, రష్యన్ తదితర వంటకాలను వడ్డించేందుకు అనువుగా 50 నుంచి 60 రకాల గిన్నెలు, ప్లేట్లు, స్పూన్లు, మూతలతో కూడిన కంటైనర్లను రూపొందించారు. ప్రతి వస్తువుకు మెరుగైన నాణ్యత, మెరుపు వచ్చేలా పది దశల్లో కోటింగ్, ఫినిషింగ్ ప్రక్రియ నిర్వహించారు. సంస్థ సీఈవో అరుణ్ పబువాల్ మాట్లాడుతూ.. 2023 జీ20 సదస్సుతోపాటు పలు ప్రముఖుల కార్యక్రమాలు, విదేశీ అధ్యక్షుల పర్యటనల్లోనూ తమ టేబుల్‌వేర్‌ను ఉపయోగించినట్లు తెలిపారు. ఎండీ అంతర పబువాల్ మాట్లాడుతూ.. నాణ్యత విషయంలో రాజీపడకుండా పూత, డిజైన్, ఫినిషింగ్‌కు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నామని, తయారీ నుంచి డిస్పాచ్ వరకు పది దశల్లో ఫినిషింగ్ ప్రక్రియ ఉంటుందని వివరించారు.



### మోదీతో ప్రపంచ నేతల వరుస భేటీలు

బ్రిక్స్ సదస్సు సందర్భంగా ప్రధాని మోదీ పలువురు దేశాధినేతలు, ప్రభుత్వాధినేతలతో ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించారు. ఇథియోపియా ప్రధాని అబియ్ అహ్మద్‌తో ఆర్థిక సంబంధాలు, రక్షణ సహకారం, సాంకేతిక పరిజ్ఞాన మార్పిడి, ఆఫ్రికన్ యూనియన్ అభివృద్ధి, గ్లోబల్ సౌత్ ప్రయోజనాలపై చర్చించారు. మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీంతో సెమీకండక్టర్ల తయారీ, కీలక ఖనిజాలు, స్వచ్ఛ ఇంధనం, మౌలిక సదుపాయాలు, వాణిజ్య విస్తరణపై చర్చించారు. అబుదాబి క్రౌన్ ప్రిన్స్ షేక్ ఖలీద్‌తో హైదరాబాద్ హౌస్‌లో జరిగిన భేటీలో భారత్–యూఏఈ సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం, పెట్టుబడులు, స్వచ్ఛ ఇంధనం, వ్యాపార కారిడార్లు, ఆర్థిక సహకారంపై చర్చించారు. వియత్నాం ప్రధాని లే మిన్ హంగ్‌తో జరిగిన భేటీలో భారత్ 'యాక్ట్ ఈస్ట్' విధానంలో వియత్నాం కీలక భాగస్వామి అని మోదీ పేర్కొన్నారు. సముద్ర భద్రత, ఆర్థిక సహకారం, ఇండో–పసిఫిక్ ప్రాంత స్థిరత్వంపైనా చర్చించారు. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్‌తో పశ్చిమాసియా ఉద్రిక్తతలు, చాబహార్ పోర్టు ప్రాజెక్టు పురోగతి, అంతర్జాతీయ నౌకాయాన భద్రత, సముద్ర వాణిజ్య పరిరక్షణపై చర్చించారు.

### మోదీ-జిన్‌పింగ్ కీలక భేటీ

బ్రిక్స్ వేదికగా ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ మధ్య కీలక ద్వైపాక్షిక భేటీ జరిగింది. సరిహద్దు ఒప్పందాలు, వాణిజ్యం, పర్యాటకం, వ్యాపారం, సాంస్కృతిక సంబంధాలపై ఇరువురు నేతలు చర్చించారు. సరిహద్దు ఒప్పందాలను ఇరు దేశాలు తప్పనిసరిగా గౌరవించాలని మోదీ పేర్కొన్నారు. సరిహద్దుల్లో శాంతి, భద్రతలే ద్వైపాక్షిక సంబంధాలకు పునాది అని స్పష్టం చేశారు. సరిహద్దు వివాదాలకు న్యాయబద్ధమైన, పరస్పర ఆమోదయోగ్యమైన పరిష్కారం కనుగొనేందుకు రెండు దేశాలు కట్టుబడి ఉండాలని, పరస్పర గౌరవం, సున్నితత్వం, ప్రయోజనాలు మార్గదర్శకంగా ఉండాలని మోదీ పేర్కొన్నారు. భారత్–చైనా మధ్య విభేదాలు వివాదాలుగా మారకూడదని ఇరువురు నేతలు అభిప్రాయపడ్డారు. రెండు దేశాల మధ్య భారీ వాణిజ్య లోటు, సరఫరా సమస్యలపైనా చర్చ జరిగింది. భారత ఉత్పత్తులకు చైనా మార్కెట్లలో సరైన ప్రవేశం కల్పించాలని మోదీ కోరారు. వ్యాపారం, పర్యాటకం, సాంస్కృతిక బదిలీలకు మరింత ఊతమివ్వాలని నిర్ణయించారు. బ్రిక్స్ సదస్సు విజయవంతానికి సహకరించినందుకు చైనాకు ప్రధాని మోదీ ధన్యవాదాలు తెలిపారు. న్యూఢిల్లీ డిక్లరేషన్‌కు ఏకగ్రీవ ఆమోదం లభించడం, పశ్చిమాసియా సంక్షోభంపైనా ఉమ్మడి వైఖరి

# జకీర్ నాయక్ భారత్‌కు అప్పగింతపై చర్చించాం

## మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం ప్రకటన

### బ్రిక్స్ సదస్సు వేదికగా ప్రధాని మోదీతో ద్వైపాక్షిక భేటీలో జకీర్ ప్రస్తావన



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 12 (సమయం న్యూస్):** వివాదాస్పద మత ప్రచారకుడు జకీర్ నాయక్‌ను భారత్‌కు అప్పగించే అంశం మరోసారి తెరపైకి వచ్చింది. 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీతో జరిపిన చర్చల్లో జకీర్ నాయక్ అప్పగింత అంశం ప్రస్తావనకు వచ్చినట్లు మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం వెల్లడించారు. అయితే ఈ విషయంలో తమ దేశ చట్టాలకు లోబడే నిర్ణయం తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. బ్రిక్స్ సదస్సుకు హాజరైన అన్వర్ ఇబ్రహీం.. మోదీతో జరిపిన అంతర్గత చర్చల్లో జకీర్ నాయక్ అంశంపై మాట్లాడినట్లు తెలిపారు. జకీర్‌ను అప్పగించాలన్న భారత్ అభ్యర్థనను మలేషియా చట్టాలకు అనుగుణంగా జాగ్రత్తగా పరిశీలిస్తామని పేర్కొన్నారు. చట్టాన్ని గౌరవించడంతోపాటు భారత్--మలేషియా ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేయడం కూడా ముఖ్యమని చెప్పారు. ఇరు దేశాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ఈ అంశంపై చర్చలను గోప్యంగా ఉంచాలని భావించినట్లు అన్వర్ తెలిపారు. రెండు దేశాల మధ్య పరస్పర నమ్మకం, అనుబంధాన్ని మరింత బలోపేతం చేయడానికే తొలి ప్రాధాన్యం ఇస్తున్నామని స్పష్టం చేశారు. జకీర్ నాయక్‌పై భారత్‌లో విద్వేషపూరిత ప్రసంగాలు, మనీలాండరింగ్‌కు సంబంధించిన ఆరోపణలతో పలు కేసులు నమోదయ్యాయి. భారత దర్యాప్తు సంస్థలు అతడి కార్యకలాపాలు, నెట్‌వర్క్‌పై విచారణ చేపట్టిన నేపథ్యంలో 2016లో ఆయన మలేషియాకు వెళ్లారు. అప్పటి నుంచి అక్కడే నివసిస్తున్నారు. జకీర్ నాయక్‌ను విచారణ కోసం తమకు అప్పగించాలని భారత్ కొన్నేళ్లుగా మలేషియాను కోరుతోంది. అయితే అప్పగింతకు సంబంధించిన అభ్యర్థనను తమ దేశ చట్టాలు, సమర్పించిన ఆధారాల ప్రకారమే పరిశీలిస్తామని మలేషియా గతంలో పేర్కొంది. జకీర్ నాయక్‌పై రెడ్ నోటీసు జారీ చేయాలన్న అభ్యర్థనకు అవసరమైన ప్రమాణాలు నెరవేరలేదని ఇంటర్‌పోల్ గతంలో నిర్ణయించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో బ్రిక్స్ సదస్సు సందర్భంగా మోదీ--అన్వర్ ఇబ్రహీం చర్చల్లో జకీర్ నాయక్ అప్పగింత అంశం మరోసారి ప్రస్తావనకు రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే ఈ చర్చలతో అప్పగింతపై తక్షణ నిర్ణయం వెలువడినట్లు కాకుండా.. మలేషియా చట్టపరమైన ప్రక్రియ ఆధారంగానే తదుపరి పరిణామాలు ఉ

# ఆరేళ్ల చిన్నారిపై ఘోరం.. మేనమామకు మరణశిక్ష

## అత్యాచారం, హత్య కేసులో ఫాస్ట్‌ట్రాక్ కోర్టు తీర్పు

### 17 నెలల్లోనే పూర్తయిన కేసు విచారణ

**ఛత్తీస్‌గఢ్, సెప్టెంబర్ 12 (సమయం న్యూస్):** ఆరేళ్ల చిన్నారిపై అత్యాచారానికి పాల్పడి హత్య చేసిన కేసులో నిందితుడికి ఫాస్ట్‌ట్రాక్ కోర్టు మరణశిక్ష విధించింది. చిన్నారికి మేనమామ అయిన సోమేష్ యాదవ్‌ను దోషిగా తేల్చిన న్యాయస్థానం.. ఈ కేసును అత్యంత అరుదైనదిగా పరిగణిస్తూ ఉరిశిక్ష ఖరారు చేసింది. అదనపు సెషన్స్ జడ్జి అనిష్ దూబే ఈ మేరకు తీర్పు వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్‌లోని దుర్గ్ జిల్లా ఓంనగర్ ఉర్లా ప్రాంతంలో గత ఏడాది ఏప్రిల్‌లో ఈ దారుణం చోటుచేసుకుంది. స్థానికంగా జరిగిన ఉత్సవం సందర్భంగా ఆరేళ్ల చిన్నారి తన అమ్మమ్మ ఇంటికి వెళ్లింది. సాయంత్రం చీకటి పడినా ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాల్లో వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో మోహన్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు, కుటుంబ సభ్యులు గాలిస్తుండగా సమీపంలోని ఓ కారు డిక్కీలో చిన్నారి మృతదేహం లభించింది. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా చిన్నారిపై లైంగిక దాడి చేసి, అనంతరం హత్య చేసినట్లు పోలీసులు నిర్ధారించారు. దర్యాప్తులో ఆధారాలను చెరిపివేసేందుకు నిందితుడు ప్రయత్నించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ క్రమంలో చిన్నారి మేనమామ సోమేష్ యాదవ్‌పై అనుమానం వ్యక్తం చేసిన పోలీసులు.. విచారణ అనంతరం అతడే నేరానికి పాల్పడినట్లు తేల్చారు. పోలీసులను తప్పుదోవ పట్టించడంతోపాటు ఆధారాలు లభించకుండా చేసేందుకు నిందితుడు ప్రయత్నించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. అనంతరం సోమేష్ యాదవ్‌ను అరెస్టు చేసిన పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. కేసు విచారణ కోసం దుర్గ్ జిల్లా కేంద్రంలో ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయగా.. 17 నెలల్లోనే విచారణ పూర్తయింది. నేర తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం దీనిని అత్యంత అరుదైన కేసుగా పేర్కొంటూ నిందితుడికి మరణశిక్ష విధించింది.



# అసత్య ప్రచారాలతో కాంగ్రెస్‌లో చిచ్చు పెట్టొద్దు

- **కార్పొరేషన్ ఎన్నికలు ఏ ఒక్క వ్యక్తికి సంబంధించినవి కావు.. పార్టీ విజయమే లక్ష్యం**
- **మూడు కార్పొరేషన్ల లో కాంగ్రెస్ జెండా ఎగరేయడమే ధ్యేయం**
- **కార్యకర్తలకు అండగా ఉంటాం.. మనోధైర్యం కోల్పోవద్దు...డిసిసి అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్**

**వరంగల్, సెప్టెంబర్ 12 (సమయం న్యూస్) :** తెలంగాణలో రానున్న కార్పొరేషన్ ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ పార్టీలో ఎలాంటి అభ్యర్థుల ఎంపికపై గానీ, ఎన్నికల వ్యూహంపై గానీ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక చర్చ జరగలేదని వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ స్పష్టం చేశారు. పార్టీకి సంబంధించిన ఎన్నికల అంశాలపై ఎవరితోనూ ప్రత్యేకంగా చర్చలు జరగలేదని తెలిపారు. ఈ విషయంలో వస్తున్న అసత్య ప్రచారాలను కార్యకర్తలు, ప్రజలు నమ్మవద్దని కోరారు. కార్పొరేషన్ ఎన్నికలు ఏ ఒక్క వ్యక్తికి సంబంధించినవి కావని, కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన ఎన్నికలని ఆయన పేర్కొన్నారు. పార్టీని విజయపథంలో నడిపించేందుకు కార్యకర్త నుంచి ముఖ్యమంత్రి స్థాయి వరకు ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. వ్యక్తిగత ప్రయోజనాలు, వర్గ విభేదాలకు తావివ్వకుండా పార్టీని బలోపేతం చేయడమే ప్రతి కాంగ్రెస్ కార్యకర్త లక్ష్యంగా ఉండాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ ఒక ఉమ్మడి కుటుంబం లాంటిదని, ఎన్నికల సమయంలో అన్ని వర్గాలు, అన్ని స్థాయిల నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేస్తేనే పార్టీకి ఘన విజయం సాధ్యమవుతుందన్నారు. అనవసరమైన ఊహాగానాలు, అసత్య ప్రచారాలతో



పార్టీలో చిచ్చుపెట్టే ప్రయత్నాలు చేయడం తగదని హితవు పలికారు. కాంగ్రెస్ పార్టీ కోసం కష్టకాలంలో జెండా మోసిన ప్రతి కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. నాయకులు, కార్యకర్తలు గ్రూపులుగా విడిపోతే పార్టీ కోసం ఎన్నో ఏళ్లుగా కష్టపడుతున్న కార్యకర్తల్లో మనోధైర్యం దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరూ సంయమనం పాటించి పార్టీ ఐక్యతను కాపాడాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. ఖమ్మం, వరంగల్, హైదరాబాద్ కార్పొరేషన్ల ను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకునేలా నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ విజయమే ఏకైక లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని, కార్యకర్తలకు పూర్తి భరోసా కల్పిస్తూ వారికి అండగా నిలవాలని కోరారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించి పార్టీ అధిష్ఠానం, నాయకత్వం తీసుకునే నిర్ణయాలే తుది నిర్ణయాలని, అప్పటివరకు వచ్చే ప్రచారాలను పట్టించుకోవాల్సిన అవసరం లేదని తెలిపారు. కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడం, పార్టీ అభ్యర్థులను గెలిపించడం, మూడు కార్పొరేషన్ల లో కాంగ్రెస్ విజయకేతనం ఎగురవేయడం కోసం అందరం కలిసికట్టుగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. పార్టీ కార్యకర్తలకు ఎలాంటి సందేహాలు, అపోహలు కలగకుండా నాయకత్వం స్పష్టమైన భరోసా కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొంటూ అసత్య ప్రచారాలను నమ్మకుండా పార్టీ ఐక్యత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

# రాజీ మార్గమే రాజ మార్గం

- **జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ నాగరాజు**



**ఖమ్మం, సెప్టెంబర్ 12 : ( సమయం న్యూస్ )** రాజీ మార్గమే రాజ మార్గమని, రాజీ పడదగ్గ కేసులలో రాజీ పడి, సత్వర న్యాయం పొందాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం. నాగరాజు తెలుపారు. జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థల ఆదేశాల మేరకు ఖమ్మం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో 3వ జాతీయ లోక్ అదాలత్‌ను శనివారం ఖమ్మం న్యాయ సేవా సదన్‌లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం. నాగరాజు ప్రారంభించి, ప్రసంగించారు. ఖమ్మం జిల్లాలో 15 లోక్ అదాలత్ బెంచ్‌ల ఏర్పాటు చేసినట్లు, ఇందులో ఖమ్మం హెడ్ క్వార్టర్ లో 9, సత్తుపల్లిలో 3, మధిరలో 3 బెంచ్ లు ఉన్నాయని అన్నారు. ప్రజలకు వేగంగా, సమర్థవంతంగా న్యాయం అందించేందుకు వీటిని ఏర్పాటుచేశామన్నారు. సివిల్ కేసులు, కాంపౌండబుల్ క్రిమినల్ కేసులు, మోటార్ వాహన ప్రమాద పరిహార కేసులు, బ్యాంక్ రికవరీ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, కుటుంబ/వైవాహిక వివాదాలు, ప్రీ-లిటిగేషన్ కేసులు, వినియోగదారుల వివాదాలు, రాజీపడదగ్గ కేసులన్నీ లోక్ అదాలత్ లో పరిష్కారం అవుతాయన్నారు. ప్రాచీన కాలం నుంచే మన సంస్కృతిలో సామరస్య పరిష్కార వ్యవస్థలు ఉన్నాయని, లోక్ అదాలత్ అనేది వివాదాలను

త్వరగా, తక్కువ ఖర్చుతో ముగించే సరళమైన మార్గమని తెలిపారు. కోర్టు ఫీజులు చెల్లించి ఉంటే వాటిని సంబంధిత పక్షాలకు తిరిగి చెల్లిస్తారని, లోక్ అదాలత్ ఇచ్చే తీర్పు సివిల్ కోర్టు డిక్రీతో సమానమైన చట్టబద్ధత కలిగి ఉంటుందని అన్నారు. లోక్ అదాలత్ ద్వారా సమయం, ధనం ఆదా అవుతుందని, కోర్టుల చుట్టూ తిరిగే శ్రమ తగ్గడమే కాకుండా, కక్షలు-కార్పణ్యాలు లేకుండా రెండు పక్షాలకూ విన్-విన్ ఫలితం లభిస్తుందని ప్రధాన న్యాయమూర్తి తెలిపారు. ఇరుపక్షాల అంగీకారంతో తీర్పు వెలువడటం వల్ల మళ్లీ ఉన్నత కోర్టుల్లో అప్పీలు చేసుకునే అవసరం ఉండదని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ అన్నారు. గతంలో నిర్వహించిన లోక్ అదాలత్‌లలో ఖమ్మం జిల్లా న్యాయశాఖ, పోలీసు విభాగం, న్యాయవాదుల సహకారంతో తెలంగాణ రాష్ట్రంలోనే 5వ ర్యాంకు సాధించిందని గుర్తుచేశారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ వంటి మెట్రోపాలిటన్ ప్రాంతాలతో పోటీపడి ఈ స్థాయిని సాధించడం అభినందనీయమని తెలిపారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ, సమాజంలో వివాదాలను పరస్పర అవగాహన, ఒప్పందాల ద్వారా పరిష్కరించుకోవడానికి జాతీయ లోక్ అదాలత్ అత్యంత ప్రాముఖ్యమైన వేదిక అని అన్నారు. లోక్ అదాలత్ ద్వారా కేసులను పరిష్కరించుకోవడం వల్ల బాధితులకు, వివాదంలో ఉన్న ఇరువర్గాలకు సమయం, డబ్బు ఆదా కావడంతో పాటు చట్టబద్ధమైన శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. చిన్న చిన్న వివాదాలను ఇరుపక్షాలు కూర్చుని మాట్లాడుకోవడం వల్ల న్యాయస్థానాలపై కేసుల భారం తగ్గుతుందని తెలిపారు. పోలీసు శాఖ, బార్ కౌన్సిల్, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు , న్యాయధికారులు సమన్వయంతో పనిచేసి లోక్ అదాలత్ ద్వారా గరిష్ట సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యేలా చూడాలని అన్నారు. గత లోక్ అదాలత్‌లో దాదాపు 5,800 కేసులు పరిష్కారం కాగా, ప్రస్తుతం 7,800 కేసులు సిద్ధంగా ఉన్నాయని, ఈ సంఖ్యను 10,000 దాటించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పోలీస్ కమిషనర్ వెల్లడించారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, తమ వివాదాలను స్నేహపూర్వక వాతావరణంలో పరిష్కరించుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా లోక్ అదాలత్ లో పరిష్కారం అయిన కేసులకు సంబంధించి చెక్కులను ప్రధాన న్యాయమూర్తి అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా కోర్ట్ న్యాయమూర్తి వీ. శీనయ్య, ఎస్సీ, ఎస్టీ కోర్ట్ న్యాయమూర్తి పి.పి. కృష్ణార్జున్, కుటుంబ న్యాయస్థానం న్యాయమూర్తి మహేష్ నాథ్, బార్ కౌన్సిల్ సభ్యులు ఎం. శ్రీనివాస రావు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు యడ్లపల్లి రమేష్, జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి దేవీ మానస, న్యాయమూర్తులు కల్పన, శివరంజని, మురళీమోహన్, జ్యోతిర్మయి, రజని, బిందుప్రియ, ప్రవీణ్, నాగలక్ష్మి, పబ్లి క్ ప్రాసిక్యూటర్లు, ప్యానెల్ అడ్వకేట్లు, వివిధ శాఖల అధికారులు, బ్యాంకింగ్/ఇన్సూరెన్స్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నరు.

# న్యాయ సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం

**వికారాబాద్, సెప్టె ంబర్,12(సమయం న్యూస్)**
వికారాబాద్ జిల్లా న్యాయ సేవా సంస్థ (DLSA) ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని శనివారం వికారాబాద్ కోర్టు ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రిన్సిపల్ జిల్లా మరియు సెషన్స్ జడ్జి (PDJ) లాల్ సింగ్ శ్రీనివాస్ నాయక్ పాల్గొన్నారు.జిల్లా పోలీస్ శాఖ తరఫున అదనపు ఎస్పీ రాజేష్ మీనా, IPS పాల్గొని జాతీయ లోక్ అదాలత్ నిర్వహణలో పోలీస్ శాఖ తరఫున పూర్తి సహకారం అందించారు.ఈ సందర్భంగా న్యాయస్థా నాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను పరస్పర అంగీకారం, రాజీ మార్గంలో పరిష్కరించుకోవడానికి లోక్ అదాలత్ ఒక మంచి వేదిక అని అధికారులు పేర్కొన్నారు. దీని ద్వారా కక్షిదారులకు సమయం, ఖర్చు ఆదా కావడంతో పాటు సత్వర న్యాయం లభిస్తుందని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జి పి. ప్రదీప్ నాయక్, జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి ఏ. రాధిక, సీనియర్ సివిల్ జడ్జి ఎం. వెంకటేశ్వర్లు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఆర్. శాంతిలత, అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎస్. వైష్ణవి, జిల్లా సంక్షేమ అధికారి కె. కాంతారావు, DLSA సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఉచిత కుట్టు మిషన్ల పంపిణీ

- **ఈ నెల 15లోగా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలి:**
- **జిల్లా కలెక్ట ర్ సిహెచ్ ప్రియాంక**



**నారాయణపేట, సెప్టెంబర్, 12 (సమయం న్యూస్)** జిల్లాలోని బీసీ మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రోత్సాహం అందించేందుకు ఇంటింటికి ఇందిరమ్మ కుట్టు మిషన్ల పంపిణీ పథకం కింద ఉచిత కుట్టు మిషన్ల పంపిణీకి అర్హులైన మహిళలు సెప్టెంబర్ 15లోగా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన మహిళలు http://tgobmms.cgg.gov.in
పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకొనుటకు ఈ నెల 15 చివరి తేదీ అని తెలిపారు. దరఖాస్తుదారుల వయస్సు 18 నిండి 55 సంవత్సరాల లోపు ఉండాలని, నిరుద్యోగ మహిళలు, నిరుపేదలు, నిరాధారణకు గురైన వితంతు, ఒంటరి, వికలాంగులు, అనాధ మహిళలకు, టైలరింగ్ ట్రైనింగ్ సర్టిఫికెట్ ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. నివాసం, కులం, ఆదాయం, ఆధార్, విద్యార్హత, టైలరింగ్ శిక్షణకు సంబంధించిన ధ్రువపత్రాలు, తెల్ల రేషన్ కార్డ్ లేదా ఆహార భద్రత కార్డు కలిగి ఉండాలని, కనీస అక్షరాస్యత తప్పనిసరి అని, ఎక్కువ దరఖాస్తులు వస్తే కనీస విద్యార్హత ఐదవ తరగతి పాసైన వారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. కుటుంబంలో ఒకరికి మాత్రమే అవకాశం ఉంటుందని, కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణులకు 1.50 లక్షలు, పట్టణ వాసులకు రెండు లక్షల లోపు ఉన్నవారు అర్హులని తెలిపారు. 2023-24 ఆర్థి క సంవత్సరంలో బీసీ స్వయం ఉపాధి పథకం కింద ఆర్థిక లబ్ధి పొందిన వారు అర్హులు కాదని స్పష్టం చేశారు. దరఖాస్తుదారులు దరఖాస్తులను సంబంధిత వెబ్సైట్ నుండి డౌన్లోడ్ చేసుకుని కుల, ఆదాయ, నివాస, ఆధార్ కార్డు, రేషన్ కార్డ్, విద్యార్హతలు, టైలరింగ్ శిక్షణ, అనుభవం తదితర ధ్రువీకరణ పత్రాలతో గ్రామీణులు సంబంధిత మండల పరిషత్ అభివృద్ధి అధికారికి, పట్టణ ప్రాంతవాసులు సంబంధిత మున్సిపల్ కమిషనర్లకు ఈ నెల 15లోగా దరఖాస్తులు సమర్పించాలని కలెక్టర్ సూచించారు........

## అండర్ 17 కబడ్డీ పోటీల్లో విజేతలుగా గాయత్రి స్కూల్



**వలిగొండ సెప్టెంబర్ 12 (సమయం న్యూస్)** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల స్థాయి క్రీడోత్సవాలు ఘనంగా ముగిశాయి అండర్ 17 కబడ్డీలో గాయత్రి హై స్కూల్ వలిగొండ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. వారిని గాయత్రి యజమాన్యం ఘనంగా అభినందించింది. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ మాట్లాడుతూ క్రీడలు విద్యార్థు ల్లో శారీరక మానసిక క్రమశిక్షణ నేర్పిస్తుందని అన్నారు. విజేతలను ముక్కామల విగ్నేష్, గూడూరు జస్వంత్ రెడ్డి, గరిసే మణిశంకర్, గర్దాస్ నితీష్, పొన్నాల తరుణ్ రెడ్డి, దోమల శివకుమార్, రాపోలు సాత్విక్, మార్క ప్రేమ్ కుమార్, ఎండి సోహెల్, కంకల అఖిల్ కుమార్ అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ పడమటి మురళీధర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బిమిడి యాదిరెడ్డి, ప్రిన్సిపాల్ కొంతము బిక్షపతి, ఆర్గనైజింగ్ సెక్రటరీ పాలకూర్ల వెంకటేష్, బిమిడి కవిత, జక్క నవీన్ రెడ్డి, పాల్గొన్నారు.

## మండల స్థాయి క్రీడలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల టేకులసోమారం విద్యార్థుల ప్రతిభ.



**వలిగొండ సెప్టెంబర్ 12 (సమయం న్యూస్)** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ స్థానిక ఎస్వి జెడ్పిహెచ్ఎస్ వలిగొండ క్రీడా ప్రాంగణంలో తేదీ 9,10,11 లలో జరిగిన 70వ వలిగొండ మండల స్థాయి పాఠశాలల క్రీడోత్సవాలలో కబడ్డీ,వాలీబాల్ ,చెస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల టేకులసోమారం విద్యార్థులు మంచి ప్రతిభను కనబరిచి జిల్లా స్థాయి క్రీడలకు ఎంపికయ్యారు. 17సం.బాలికల విభాగంలో కబడ్డీ లో ప్రథమ బహుమతి, 14 సం. బాలికల విభాగంలో కబడ్డీ ద్వితీయ బహుమతి, 17 సం.బాలుర విభాగంలో వాలీబాల్ ద్వితీయ బహుమతి, 17సం.బాలికల విభాగంలో వాలీబాల్ ద్వితీయ బహుమతి, 17 సం.బాలుర విభాగంలో చెస్ ప్రథమ బహుమతి సాధించారని పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ ఎక్కలదేవి మల్లేశం తెలిపారు. మండలంలో జరిగిన క్రీడలో మంచి ప్రతిభను కనబరచి జిల్లా స్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థు లను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఐ.కనకదుర్గ, గ్రామ సర్పంచ్ పడమటి మమత నరేందర్ రెడ్డి, ఉప సర్పంచ్ నారగొని అశోక్,అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ చేగూరి పద్మమ్మ, గ్రామ పెద్దలు,యువకులు మరియు పాఠశాల ఉపాధ్యాయ బృందం వీరిని అభినందించారు.

## భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు తల్లి మాతృమూర్తి.



**వలిగొండ సెప్టెంబర్ 12 (సమయం న్యూస్)** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ పట్టణ భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు మలగ బీరప్ప తల్లి మరణించారు. వారి కుటుంబాన్ని పరామర్శించి తల్లి మృతదేహానికి పూలమాల సమర్పించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష కార్యదర్శులు రాధారపు మల్లేశం ఎల్లం స్వామి మరియు వలిగొండ మండల మాజీ అధ్యక్షులు సింగారపు వెంకటేశం ఇక్కడ స్వామి దంతర పోయిన సంజీవ పట్టణ మాజీ అధ్యక్షులు సామల సత్తయ్య ఉపాధ్యక్షులు సింగారపు లక్ష్మణ్ మండల బాధ్యులు బూడిద నరసింహా వలిగొండ పట్టణ ప్రధాన కార్యదర్శి పోలేపాక శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## నవీన ఆదర్శ స్కూల్ లో పేరెంట్స్ టీచర్స్ మీటింగ్



**కొడంగల్ మున్సిపల్, సెప్టెంబర్,12(సమయం న్యూస్)** ఘనంగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ నిర్వహించిన నవీన ఆదర్శ స్కూల్ ఉపాధ్యాయ బృందం & మేనేజ్మెంట్..ప్రతి నెల రెండో శనివారం పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ భాగంగా శనివారం విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు ఎఫ్ ఏ-1 ప్రగతి పత్రాలు అందజేశారు.ఇట్టి కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి వీ.నరేష్ రాజ్, వైస్ ప్రిన్సిపాల్ సంతోష ,స్కూల్ ఫౌండర్ డి వెంకటయ్య, ఉపాధ్యాయుల బృందం అందరూ కలిసి ప్రగతి పత్రాలు, ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. అలాగే ఇంటిదగ్గర విద్యార్థులను ఫోన్లకు అలవాటు పడకుండా చూసుకోవాలని తెలియజేశారు తల్లిదండ్రులు ఇంటిదగ్గర బాధ్యత తీసుకొని చదివించాలని కోరారు ఈ పేరెంట్స్ మీటింగ్ ద్వారా తల్లిదండ్రులకు ఎంతగానో ఉపయోగపడిందని తల్లిదండ్రులు తెలియజేశారు. విద్యార్థుల తల్లి దండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయుల బృందం, పాల్గొని పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ విజయవంతం చేశారు అని ప్రిన్సిపాల్ డి.వి. నరేష్ రాజ్ తెలిపారు.

## వినాయక చవితి సందర్భంగా డీజె లు వాడొద్దు ..

### దౌల్తాబాద్ ఎస్సై వేణుకుమార్ హెచ్చరిక.



**దౌల్తాబాద్ మండలం, సెప్టెంబర్,12(సమయం న్యూస్)** గణేష్ ఉత్సవ కమిటీ మరియు 33 గ్రామాల ప్రజలు అంత ఇవ్వాళ కొడంగల్ నియోజకవర్గంలోని దౌల్తాబాద్ మండల స్థానిక పోలీస్ స్టేషన్ లో ఎస్సై వేణుకుమార్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా గణేష్ ఉత్సవ కమిటీని ఉద్దేశించి ఎస్సై మాట్లాడుతూ,, రాబోయే 14 తేదీన గణేష్ వినాయక్ చవితి ఏర్పాటు చేస్తున్న సంందర్భంగా గణేష్ మండపాల్లో డీజెలు ఏర్పాటు చేయొద్దని సౌండ్ సిస్టం తగ్గించాలని డీజే సౌండ్ నిర్వాహకులకు తెలిపారు.ఈకార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్ లు,ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు,మరియు వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## భక్తి కి పర్యావరణ పరిరక్షణ తోడవ్వాలి

### బీజేపీ నాయకులు చింతిరెడ్డి వివేక్ రెడ్డి ఆధ్వర్యంలో మట్టి వినాయకుల పంపిణీ




**హనుమకొండ, సెప్టెంబర్ 12 (సమయం న్యూస్) :** వినాయక చవితి వేడుకల్లో పర్యావరణహిత మట్టి విగ్రహాలను వినియోగించాలని బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో బీజేపీ నాయకులు చింతిరెడ్డి వివేక్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం హనుమకొండ ఆర్ట్స్ కాలేజీ, జూలైవాడ జంక్షన్ వద్ద మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమానికి బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలన్ సంతోష్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు రావు పద్మ, జీడబ్ల్యూఎంసీ 60వ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ డా. దాస్యం అభినవ్ భాస్కర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రజలకు మట్టి వినాయక విగ్రహాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 'దేవుడిపై భక్తి.. ప్రకృతిపై బాధ్యత.. సేవే పరమ ధర్మం' అనే సందేశంతో కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. వినాయకుడిని మట్టి విగ్రహంతో పూజించడం ద్వారా భక్తిని చాటడంతో పాటు పర్యావరణాన్ని పరిరక్షించవచ్చన్నారు. రసాయనాలతో తయారైన విగ్రహాల నిమజ్జనం వల్ల నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. చెరువులు, నదులు, ఇతర జలవనరుల పరిరక్షణ కోసం పర్యావరణహిత విగ్రహాలనే వినియోగించాలని ప్రజలకు సూచించారు. పండుగల సందర్భంగా ప్రకృతికి హాని కలగకుండా జాగ్రత్తలు తీసుకోవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అన్నారు. భక్తి, పర్యావరణ పరిరక్షణతో పాటు సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూ ప్రజల్లో మరింత అవగాహన కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ చట్ట సవరణ బిల్లుకు ఆమోదం

### మంత్రి సీతక్కకు శంషాబాద్ మండల సర్పంచ్ లు ఘన సన్మానం



**శంషాబాద్ సమయం సెప్టెంబర్ 12:** గ్రామపంచాయతీ 2018 చట్టం సవరణ బిల్లును అసెంబ్లీలో ఆమోదించిన సందర్భంగా పంచాయతీరాజ్ మంత్రి సీతక్కను శనివారం శంషాబాద్ మండల కాంగ్రెస్ నాయకులు, సర్పంచ్ లు ప్రజాభవన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి మంత్రి సీతక్కను శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో శంషాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిలకమర్రి మహేందర్ ముదిరాజ్, శంషాబాద్ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు కేటీశ్వర్ గౌడ్ సర్పంచులు ప్రభాకర్ గౌడ్, రవి నాయక్, రవీందర్ నాయక్, బిక్యా నాయక్, కల్లే బిక్షపతి, నాయకులు ఆంజనేయులు, గోపాల్ నాయక్, దేవేందర్,రాజు, బాలు ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

## పెద్ద పల్లి జిల్లా ఆసుపత్రిలో మూడు క్లిష్ట చికిత్సలు విజయవంతం

**పెద్ద పల్లి:సెప్టెంబర్ 12( సమయం న్యూస్ )** జిల్లా ఆసుపత్రి వైద్యులు మూడు క్లిష్ట కేసులకు విజయవంతంగా చికిత్స అందించారు. 75 ఏళ్ల వ్యక్తికి మోకాలి ఇన్ఫెక్షన్ అనంతరం స్కిన్ గ్రాఫ్టింగ్ నిర్వహించగా, మరో 50 ఏళ్ల వ్యక్తికి జిల్లాలోనే తొలిసారిగా Ultrasound Guided Pigtail Catheterisation ద్వారా కాలేయంలోని చీమును తొలగించారు. డయాబెటిస్‌తో కాలి భాగం దెబ్బతిన్న మరో 75 ఏళ్ల వ్యక్తికి కూడా విజయవంతంగా శస్త్రచికిత్స చేశారు. వైద్య బృందాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. కె. శ్రీధర్ అభినందించారు. జిల్లా ఆసుపత్రిలో పలు అధునాతన వైద్య సేవలు ఉచితంగా అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

# 'గుడి లేని దేవత'.. గుండెల్లో కొలువైన 'అనిత'







- అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్ డా.కే.అనితా రెడ్డి
- పేద పిల్లలకు అండగా.. వృద్ధులకు బిడ్డగా.. మానసిక వికలాంగ చిన్నారులకు అమ్మగా.. మూడు దశాబ్దాలుగా అలసట లేని సేవా ప్రస్థానం..
- సేవకు సెలవు లేదు.. ఆత్మీయతకు అలసట లేదు..
- మూడు దశాబ్దాలుగా కొనసాగుతున్న మానవతా ప్రయాణం
- అనాథలకు అమ్మగా.. వృద్ధులకు బిడ్డగా.. ఆడపిల్లలకు ఆత్మీయురాలిగా
- పురస్కారాల కంటే.. పేద పిల్లల చిరునవ్వే ఆమెకు గొప్ప బహుమతి

**హనుమకొండ, సెప్టెంబర్ 12 (సమయం న్యూస్) :** కొంతమంది దేవుడిని గుడిలో వెతుకుతారు, మరికొందరు దేవుడి కోసం కొండలు, కోనల్లో తిరుగుతారు. కానీ ఆపదలో ఉన్నవారి కన్నీటిని తుడిచే చేతుల్లో, ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టే మనసులో, దిక్కులేని వృద్ధులకు ఆప్యాయత పంచే చిరునవ్వులో, మానసిక వికలాంగులైన చిన్నారులను అమ్మలా అక్కున చేర్చుకునే హృదయంలో దైవత్వాన్ని చూడొచ్చు. అలాంటి మానవత్వానికి ప్రతిరూపమే డా.కే.అనితా రెడ్డి. అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్‌గా, కాకతీయ విశ్వవిద్యాలయ పాలకమండలి సభ్యురాలిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆమె, పదవులు, హోదాలు, పురస్కారాలకు అతీతంగా మూడు దశాబ్దాలుగా కొనసాగిస్తున్న సేవా ప్రయాణం ఎందరికో స్ఫూర్తిదాయకం. ప్రచారం కోసం కాదు, ప్రశంసల కోసం కాదు, ఎవరో గుర్తించాలని కాదు, ఒక మనిషికి మరో మనిషి అండగా ఉండాలనే మానవతా విలువతో ఆమె అడుగులు ముందుకు సాగుతున్నాయి.

**ఆడపిల్లలకు ఆత్మీయురాలు.. మార్గదర్శి...**

ఆడపిల్లల జీవితంలో ఎదురయ్యే సమస్యలను సొంత సమస్యలుగా భావిస్తూ వారికి ఆత్మీయురాలిగా నిలుస్తున్నారు. అవసరమైనప్పుడు ఒక స్నేహితురాలిలా పలకరిస్తూ, ఒక మార్గదర్శిలా దారి చూపుతూ.. తల్లిలా ధైర్యం చెబుతూ వారి వెన్నంటే ఉంటున్నారు. "నీవు ఒంటరివి కాదు నీ వెంటే ఎవరో ఉన్నారు" అనే భరోసా ఒక్కటే ఎన్నో జీవితాల్లో కొత్త వెలుగును నింపింది. చదువుకోవాలనే తపన ఉన్న పేద విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందించడం నుంచి అవసరమైన వారికి దుస్తులు, దుప్పట్లు అందించడం వరకు ఆమె సేవా స్పర్శ విస్తరించింది.

**వృద్ధులకు బిడ్డలా.. చిన్నారులకు అమ్మలా...**

వృద్ధాశ్రమాల్లోని వృద్ధుల వద్దకు వెళ్లినప్పుడు ఆమెకు వారు వృద్ధులుగా కనిపించరు తన ఇంటి పెద్దలుగానే కనిపిస్తారు. వారి బాధలు వింటారు. ఆప్యాయంగా పలకరిస్తారు. అవసరాలు తెలుసుకుంటారు. కొద్దిసేపు వారితో గడిపినా ఆ సమయం వారికి ఎంతో విలువైనదిగా మారుతుంది. మానసిక వికలాంగుల ఆశ్రమాల్లోని చిన్నారుల దగ్గరకు వెళ్లినప్పుడు మాత్రం ఆమె ఒక సేవకురాలిగా కాదు, అమ్మలా మారిపోతారు. వారి అమాయకమైన చిరునవ్వులో ఆనందాన్ని వెతుక్కుంటారు. వారి చిన్నచిన్న అవసరాలను గమనిస్తారు. ఓర్పుతో, సహనంతో వారిని అక్కున చేర్చుకుంటారు. వారికి మందులు కావాలా, వైద్యం అవసరమా, బట్టలు కావాలా, ఆహారం కావాలా, ఏ అవసరం ఉన్నా తన వంతు చేయడానికి ముందుంటారు. ఆశ్రమాల్లో తరచూ వైద్య శిబిరాలు నిర్వహిస్తూ ఆరోగ్య సంరక్షణకు తోడ్పడుతున్నారు.

**ఇవ్వడంలోనే ఆనందం...**

పేద విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందించిన సందర్భాలు ఎన్నో.. అవసరమైన వారికి దుస్తులు, దుప్పట్లు పంచిన సందర్భాలు ఎన్నో.. ఆశ్రమాలకు వైద్య సేవలు అందించిన సందర్భాలు ఎన్నో. కానీ ఆమె చేసిన సేవలను లెక్కపెట్టడం కంటే వాటి వెనుక ఉన్న మనసును అర్థం చేసుకోవడమే ముఖ్యమని ఆమెను దగ్గరగా చూసిన వారు చెబుతారు. ఒక పుస్తకం ఒక విద్యార్థి భవిష్యత్తును మార్చవచ్చని, ఒక దుప్పటి ఒక వృద్ధుడి చలిని తీర్చవచ్చని, ఒక ఆప్యాయమైన మాట ఒకరి జీవితంలో ఆశను నింపవచ్చని ఆమె నమ్ముతారు. అందుకే సేవ ఆమెకు ఒక కార్యక్రమం కాదు, జీవన విధానం.

**అవార్డులు ఎన్నో.. గర్వం లేని నిగర్వి...**

సామాజిక సేవకు గుర్తింపుగా ఆమెకు ఎన్నో అవార్డులు, సత్కారాలు లభించాయి. మరెన్నో ఉన్నత పురస్కారాలు ఆమె సేవా ప్రయాణాన్ని గుర్తించాయి. అయితే అవార్డు అందుకున్న ప్రతిసారీ ఆమె అడుగులు మరింత వినయంగా మారాయి. తన సేవా కార్యక్రమాల్లో భర్త రాంరెడ్డి ప్రోత్సాహం మరువలేనిదని గర్వంగా చెపుతారు. పురస్కారం తన గొప్పతనానికి గుర్తింపు కాదని, సమాజం తనపై ఉంచిన బాధ్యతకు గుర్తింపుగా భావిస్తారు. ఎంత ఉన్నతమైన అవార్డు వచ్చినా, మరుసటి రోజే మళ్లీ అదే సాధారణ జీవితం. అదే ఆత్మీయత. అదే చిరునవ్వు. అదే సేవా సంకల్పం. ఎత్తుకు ఎదిగినా ఒదిగి ఉండటం, గుర్తింపు వచ్చినా గర్వపడకపోవడం. చేసిన సేవను చెప్పుకోవడానికి ఇష్టపడకపోవడం ఆమె వ్యక్తిత్వంలోని ప్రత్యేకత.

**ఇంకా ఏదో చేయాలి...**

సేవా కార్యక్రమాలు ఎన్నో చేసినా.. ఆమెకు మాత్రం ఇంకా ఏదో చేయలేదనే భావన. ఒక సమస్య పరిష్కారమైతే మరో సమస్య ఆమె కళ్లకు కనిపిస్తుంది. ఒక చిన్నారికి సహాయం చేస్తే.. ఇంకో చిన్నారి కోసం ఆలోచన మొదలవుతుంది. ఒక ఆశ్రమాన్ని సందర్శించి వస్తే.. మరో ఆశ్రమానికి వెళ్లాలనే తపన మొదలవుతుంది. సేవ చేసినందుకు అలసట ఉండదు. సేవ చేయలేకపోతేనే మనసుకు అసంతృప్తి. అందుకే ఆమె సేవా ప్రయాణానికి ముగింపు లేదు. విరామం లేదు. అలక లేదు. అలసట లేదు.

**దేవుడిచ్చిన వరంగా భావించే జన్మ...**

'ఈ జన్మ దేవుడిచ్చిన వరం. ఆ వరాన్ని నా కోసం మాత్రమే కాకుండా నన్ను అవసరమైన వారికి ఉపయోగపడేలా చేయాలి అనే ఆలోచన ఆమెను నడిపిస్తోంది. పేద పిల్లలకు చదువులో తోడుగా నిలవాలి. ఆశ్రమాల్లోని వృద్ధులకు కుటుంబ సభ్యురాలిలా ఆప్యాయత పంచాలి. మానసిక వికలాంగులైన చిన్నారులకు అమ్మలా అండగా ఉండాలి. తనకు చేతనైనంత వరకు మరొకరి జీవితంలో వెలుగు నింపాలి, ఇదే ఆమె సంకల్పం. ఆమెకు సేవ అంటే దానం చేయడం మాత్రమే కాదు. ఒకరి బాధను తన బాధగా భావించడం.. ఒకరి కన్నీటిని తన హృదయంతో తుడవడం.. ఒకరి ఒంటరితనాన్ని ఆత్మీయతతో నింపడం. అందుకే ఆమె అడుగుపెట్టిన చోట సహాయం మాత్రమే కాదు, ఆశ కూడా కనిపిస్తుంది.

**గుడిలో దేవతలు ఉంటారు.. ఆమె గుండెల్లో మానవత్వం ఉంది...**

ఆమెను చూసినవారికి ఆమె ఒక వ్యక్తిగా కనిపించవచ్చు. కానీ ఆమెతో కలిసి ప్రయాణించిన వారికి మాత్రం ఆమె ఒక ఆత్మీయత. పేద పిల్లలకు ఆమె ఆశాకిరణం. ఆడపిల్లలకు ఆమె ఆత్మీయురాలు. వృద్ధులకు ఆమె బిడ్డ. మానసిక వికలాంగ చిన్నారులకు ఆమె అమ్మ. అవసరంలో ఉన్నవారికి ఆమె అండ. సమాజానికి ఆమె ఒక స్ఫూర్తి. గుడిలోని దేవతకు పూలు సమర్పిస్తాం, కానీ గుడి గడప దాటిన తర్వాత మనిషిలోని దేవుడిని గుర్తించడం మరిచిపోతాం. అనితా రెడ్డి మాత్రం ఆ మానవత్వాన్నే తన జీవిత పూజగా మార్చుకున్నారు. ప్రశంసల కోసం కాదు, పురస్కారాల కోసం అంతకన్నా కాదు, పేరు కోసం కాదు. ఎవరో ఒకరి జీవితంలో మీ వల్ల నాకు మేలు జరిగింది అనే ఒక్క మాట వినిపిస్తే చాలు అన్నట్టుగా ఆమె సేవా ప్రయాణం సాగుతోంది. అందుకే ఆమెను పరిచయం చేయడానికి హోదాలు సరిపోవు.అవార్డులు సరిపోవు. ఆమె చేసిన సేవల జాబితా కూడా సరిపోదు. ఆమె ఒక సేవా మనసు. ఆమె ఒక ఆత్మీయత. ఆమె ఒక భరోసా. ఆమె ఒక మానవతా దీపం. గుడిలో లేని దేవత, మనుషుల మధ్య నడిచే దేవత డా.కే.అనితా రెడ్డి.

**శ్రీనివాస్ దేవులపల్లి... 'సమయం' స్టాఫ్ రిపోర్టర్... వరంగల్.**





# బీఆర్ఎస్‌కు షాక్ .. బీజేపీలోకి సీనియర్ నేత

- మామిండ్ల మోహన్‌రెడ్డి చేరికతో నర్సంపేటలో పెరుగుతున్న బలం
- బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డా. గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి

**నల్లబెల్లి/వరంగల్, సెప్టెంబర్ 12 (సమయం న్యూస్) :** నర్సంపేట నియోజకవర్గంలో బీజేపీకి ఆదరణ పెరుగుతోందని ఆ పార్టీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డా. గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి అన్నారు. నల్లబెల్లి మండలం మామిండ్లవీరయ్యపల్లె గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, క్లస్టర్ ఇన్‌ఛార్జి మామిండ్ల మోహన్‌రెడ్డి బీఆర్ఎస్‌ను వీడి బీజేపీలో చేరారు. నల్లబెల్లి మండల బీజేపీ అధ్యక్షుడు తడుక వినయ్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాణా ప్రతాప్‌రెడ్డి సమక్షంలో ఆయనకు పార్టీ కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాణా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీకి రోజురోజుకూ ప్రజలు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తల నుంచి మద్దతు పెరుగుతోందని తెలిపారు. మామిండ్ల మోహన్‌రెడ్డి చేరిక ఇందుకు నిదర్శనమన్నారు. రానున్న రోజుల్లో నర్సంపేట నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేసి ప్రతి గ్రామంలో బీజేపీకి పటిష్ఠమైన సంస్థాగత నిర్మాణం కల్పిస్తామని పేర్కొన్నారు. పార్టీలో చేరిన మోహన్‌రెడ్డి మాట్లా డుతూ దేశ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు, నర్సంపేట నియోజకవర్గంలో రాణా ప్రతాప్‌రెడ్డి ప్రజలకు అందిస్తున్న సేవలకు ఆకర్షితుడై బీజేపీలో చేరినట్లు తెలిపారు. పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు బచ్చు వెంకటేశ్వర్‌రావు, మండల ఉపాధ్యక్షుడు బత్తిని కుమారస్వామి, ముచ్చింపుల గ్రామ పార్టీ అధ్యక్షుడు ధర్మారం క్రాంతికుమార్, యువమోర్చా నాయకుడు తిమ్మాపురం శివ తదితరులు పాల్గొన్నారు.





# హైదరాబాద్ రంజీ జట్టు కెప్టెన్‌గా సిరాజ్

రంజీ ట్రోఫీ కొత్త సీజన్‌కు హైదరాబాద్ జట్టు కొత్త ఉత్సాహంతో సిద్ధమవుతోంది. భారత స్టార్ పేసర్ మహ్మద్ సిరాజ్‌కు జట్టు పగ్గాలు అప్పగించింది హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ). 2026-27 సీజన్‌లో హైదరాబాద్‌కు సిరాజ్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. చామా మిలింద్‌ను వైస్ కెప్టెన్‌గా ఎంపిక చేశారు. అక్టోబర్ 11 నుంచి రంజీ ట్రోఫీ ప్రారంభం కానుంది. తొలి మ్యాచ్‌లో త్రిపురతో హైదరాబాద్ తలపడనుంది. హైదరాబాద్ ఎలైట్ గ్రూప్-బిలో ఉంది. సౌరాష్ట్ర, కర్ణాటక, పంజాబ్, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, అసోం, త్రిపుర ఈ గ్రూపులో ఉన్నాయి. ఇటీవల శ్రీలంక పర్యటనలో సిరాజ్ ఆశించిన స్థాయిలో వేగం చూపలేకపోయాడు. సాధారణంగా గంటకు 140 కిలోమీటర్లకు పైగా వేగంతో బంతులు వేసే అతడు.. అక్కడ 120 కిలోమీటర్ల వేగంతో బౌలింగ్ చేశాడు. రెండు మ్యాచ్‌ల్లో 44 ఓవర్లు వేసి నాలుగు వికెట్లు తీసుకున్నాడు. రెండు నెలల విరామం తర్వాత నేరుగా మ్యాచ్ ఆడటంతో తన బౌలింగ్ లయ దెబ్బతిన్నట్లు సిరాజ్ తెలిపాడు. రన్‌అప్‌లో అడుగులు సరిగ్గా పడకపోవడంతో వేగం తగ్గిందని చెప్పాడు. దులీప్ ట్రోఫీ ఫైనల్లో మాత్రం సిరాజ్ తిరిగి లయ అందుకున్నాడు. శ్రీలంక నుంచి వచ్చిన కొన్నిరోజులకే చెన్నై మ్యాచ్ ఆడినా.. దేశం తరఫున ఆడేటప్పుడు సాకులు చెప్పకూడదని స్పష్టం చేశాడు. జట్టు కోసం పూర్తి స్థాయిలో కష్టపడటమే తనకు ముఖ్యమని చెప్పాడు. ఇప్పుడు హైదరాబాద్ కెప్టెన్‌గా సిరాజ్ ముందు మరో సవాలు ఉంది. నాయకత్వంతో పాటు బంతితోనూ సత్తా చాటేందుకు అతడికి రంజీ సీజన్ మంచి అవకాశం కానుంది.

# నేడు ఆఫ్ఘనిస్తాన్ తో టీమిండియా టీ20

- ఢిల్లీ అరుణ్ జైట్లీ స్టేడియం మ్యాచ్
- సవాల్‌గా మారిన తుది జట్టు ఎంపిక






శ్రేయాస్ అయ్యర్ సారథ్యంలోని భారత టీ20 జట్టు ఇటీవలే జింబాబ్వే పర్యటనను దిగ్విజయంగా ముగించుకుంది. ఈ సిరీస్ ను 3-0 తేడాతో కైవసం చేసుకుంది. అంతకుముందు ఐర్లాండ్, ఇంగ్లాండ్ లల్లో చవి చూసిన పరిపూర్ణ ఓటముల గాయాన్ని జింబాబ్వే సిరీస్ కొంతవరకు నయం చేయగలిగింది. ఇక.. మూడు టీ20 మ్యాచ్ ల సిరీస్ ఆడబోతోంది. ఆఫ్ఘనిస్తాన్ తో తలపడబోతోంది. ఈ మూడు మ్యాచ్ లకు ఢిల్లీ అరుణ్ జైట్లీ స్టేడియం ఆతిథ్యాన్ని ఇస్తోంది. అన్ని మ్యాచ్‌లు రాత్రి 7:30 గంటలకు ప్రారంభమౌతాయి. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో బరిలోకి దిగుతున్న టీమిండియా.. జింబాబ్వేపై సాధించిన విజయ పరంపరను కొనసాగించాలనే పట్టుదలతో ఉంది. తుది జట్టును ఎంపిక చేయడం పెద్ద సవా వాల్‌గా మారింది. స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ జట్టులోకి తిరిగి రావడంతో ఈక్వేషన్లు మారాయి. జింబాబ్వే పర్యటనకు దూరమైన శాంసన్ ఇప్పటివరకు ఆడిన 14 మ్యాచ్‌ల్లో 180.99 స్ట్రైక్ రేట్‌తో ఏకంగా 400 పరుగులు సాధించాడు. ఇందులో మూడు అర్ధ సెంచరీలు ఉన్నాయి. టీమిండియా ఓపెనింగ్ స్థానం కోసం గట్టి పోటీ నెలకొంది. జింబాబ్వే సిరీస్‌లో వరుసగా రెండు హాఫ్ సెంచరీలు సాధించి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అందుకున్న వైభవ్ సూర్యవంశీ వైపే మేనేజ్‌మెంట్ మొగ్గు చూపే అవకాశం ఉంది. మరో ఓపెనర్ అభిషేక్ శర్మ ప్రస్తుత ఫామ్ ఆందోళన కలిగిస్తోంది. గత మూడు మ్యాచ్‌ల్లో అతను కేవలం 11 పరుగులు మాత్రమే చేశాడు. మొదటి మ్యాచ్‌లో అభిషేక్ రాణించకపోతే, మిగిలిన రెండింటికీ సంజూ శాంసన్‌ను ఓపెనర్‌గా పంపే అవకాశం ఉంది. వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ కూడా ఓపెనర్ రేసులో ఉన్నాడు. దులీప్ ట్రోఫీ ఫైనల్లో సౌత్ జోన్‌పై 270 పరుగుల రికార్డు ఇన్నింగ్స్‌తో ఇషాన్ తన ఫామ్‌ను నిరూపించుకున్నాడు. దీంతో అతను నాలుగో స్థానంలో ఆడే అవకాశాలు ఉన్నాయి. ఇక మిడిల్ ఆర్డర్‌లో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, వైస్ కెప్టెన్ తిలక్ వర్మ జట్టుకు వెన్నెముకగా నిలవనున్నారు. ఆల్‌రౌండర్ కోటాలో ఎవరిని ఎంపిక చేయాలనే దానిపై తర్జన భర్జన జరుగుతోంది. శివమ్ దూబే, నితీష్ కుమార్ రెడ్డిల్లో ఒకరికి అవకాశం దక్కొచ్చు. ఎవరిని ఆడిస్తారనేది పిచ్ పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. బ్యాటింగ్ డెప్త్ పెంచాలనుకుంటే దూబే వైపు, బౌలింగ్ ఆప్షన్ వైపు మొగ్గు చూపితే నితీష్ రెడ్డిని ఎంపిక చేసే అవకాశం ఉంది. బౌలింగ్ విభాగంలో మేనేజ్‌మెంట్ జస్‌ప్రీత్ బుమ్రా ఫిట్‌నెస్‌పై దృష్టి సారించింది. అర్ష్‌దీప్ సింగ్, స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి, అక్షర్ పటేల్ ఈ మ్యాచ్ లో కీలకం కానున్నారు.

# చెన్నై యాజమాన్యం క్లారిటీతో తెరపడిన ఉత్కంఠ




చెన్నై సూపర్ కింగ్స్ ఫ్రాంచైజీలో ధోనీ వాటాలు కోరారనే ప్రచారం క్రీడా వర్గాల్లో పెద్ద ఎత్తున కలకలం రేపింది. ఈ ఊహాగానాలపై సీఎస్కే యాజమాన్యం అధికారికంగా స్పందిస్తూ స్పష్టత ఇచ్చింది. అదే సమయంలో కొత్త కోచ్ ఎంపిక, రాబోయే ఐపీఎల్ వ్యూహాలపై కూడా కీలక సమాచారం వెలువడింది. చెన్నై సూపర్ కింగ్స్ ఫ్రాంచైజీలో వాటాలను కొనుగోలు చేయడానికి ధోనీ ఆసక్తి చూపించారని, అయితే ఆయన పెట్టిన షరతులకు యాజమాన్యం అంగీకరించలేదని కొన్ని వార్తలు హల్‌చల్ చేశాయి. ఈ ప్రచారంపై సీఎస్కే పెద్ద అధికారి ఒకరు తీవ్రంగా స్పందించారు. ధోనీ నుంచి అలాంటి ప్రతిపాదన ఏది తమ వద్దకు రాలేదని, ఆయనతో దీనిపై ఎలాంటి చర్చలు జరగలేదని స్పష్టం చేశారు. ఎన్ శ్రీనివాసన్‌తో ఆయన వ్యక్తిగతంగా మాట్లాడారో లేదో తమకు తెలియదని వివరించారు. గతంలో సీఎస్కే షేర్లు ప్రైవేట్ విక్రయానికి అందుబాటులో ఉన్న సమయంలో ధోనీ కొన్ని షేర్లను కొనుగోలు చేసిన మాట నిజమేనని ఫ్రాంచైజీ వర్గాలు వెల్లడించాయి. ఈ షేర్లు బహిరంగ మార్కెట్లో విక్రయించబడవు కాబట్టి ప్రైవేట్‌గానే కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ధోనీ వద్ద లక్షకు పైగా షేర్లు ఉన్నప్పటికీ, మొత్తం ఫ్రాంచైజీ వాటాతో పోలిస్తే అది చాలా చిన్న భాగం మాత్రమే. ప్రస్తుతం శ్రీనివాసన్ కుటుంబం వద్దే 55 శాతానికి పైగా ప్రైవేట్ వాటాలు భద్రంగా ఉన్నాయి. ప్రస్తుతం అమెరికా పర్యటనలో ఉన్న ధోనీ సెప్టెంబర్ 22 నాటికి భారత్‌కు తిరిగి రానున్నారు. ఆయన స్వదేశానికి చేరుకున్న వెంటనే ఐపీఎల్ 2027 వేలానికి సంబంధించి, అలాగే ఆటగాళ్ల ట్రేడింగ్, బదిలీలపై సీఎస్కే యాజమాన్యం ఒక కీలక సమావేశం నిర్వహించనుంది. ప్రధానంగా సీఎస్కే కొత్త హెడ్ కోచ్ ఎంపికలో ధోనీ పాత్ర అత్యంత కీలకం కానుంది. ఒక విదేశీ దిగ్గజ ఆటగాడిని కోచ్‌గా నియమించే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. అభిమానుల్లో ఎన్నో సందేహాలు ఉన్నప్పటికీ ధోనీ, సీఎస్కే బంధం ఎప్పటిలాగే బలంగా ఉంది. సెప్టెంబర్ చివరి వారంలో జరగబోయే సీఎస్కే సమావేశం తర్వాత కొత్త కోచ్ ఎవరనే దానిపై పూర్తి స్పష్టత రానుంది.




# ఇంగ్లాండ్ గడ్డపై పాక్‌కు ఘోర పరాభవం..

### మూడో టెస్టులోనూ పాకిస్థాన్‌కు ఓటమి

ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరిగిన మూడో టెస్టులో ఇంగ్లాండ్ జట్టు 8 వికెట్ల తేడాతో పాకిస్థాన్‌ను చిత్తు చేసింది. ఈ విజయంతో మూడు టెస్టుల సిరీస్‌ను 3-0తో క్లీన్ స్వీప్ చేసి పాకిస్థాన్‌కు ఘోర పరాభవాన్ని మిగిల్చింది. కెప్టెన్‌గా జో రూట్ రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన తర్వాత తొలి సిరీస్‌నే క్లీన్ స్వీప్ చేయడం గమనార్హం. తొలి రెండు టెస్టులతో పోలిస్తే.. మూడో టెస్టులో పాక్ కాస్త పోరాడినా ఓటమిని మాత్రం తప్పించుకోలేకపోయింది. దీంతో నాలుగు రోజుల్లోనే టెస్ట్ మ్యాచ్ ముగిసింది. 130 పరుగుల స్వల్ప లక్ష్యంతో నాలుగో రోజు ఆట ప్రారంభించిన ఇంగ్లాండ్‌కు పాకిస్థాన్ పేసర్ మహమ్మద్ అబ్బాస్ షాక్ ఇచ్చాడు. తొలి బంతికే డకెట్‌ను డకౌట్‌గా వెనక్కి పంపిన అబ్బాస్, అదే ఓవర్లో ఎమిలియో గేని కూడా పెవిలియన్ చేర్చాడు. కేవలం 2 పరుగులకే 2 వికెట్లు కోల్పోయిన ఇంగ్లాండ్‌పై పాక్ పైచేయి సాధించినట్లు కనిపించింది. అబ్బాస్ తన కట్టుదిట్టమైన స్పెల్‌తో ఇంగ్లాండ్ బ్యాటర్లను ఒత్తిడిలోకి నెట్టాడు. అయితే కెప్టెన్ జో రూట్, జోర్డాన్ కాక్స్ కలిసి ఇంగ్లాండ్‌ను ఆదుకున్నారు. పాకిస్థాన్ బౌలర్ల దాడిని తట్టుకుంటూ నెమ్మదిగా స్కోరు బోర్డును ముందుకు నడిపారు. ఈ క్రమంలో పాకిస్థాన్ చేసిన పొరపాట్లు రూట్‌కు బాగా కలసివచ్చాయి. మహమ్మద్ అలీ బౌలింగ్‌లో రూట్ బంతిని వికెట్లపైకి ఆడుకున్నప్పటికీ అది నో-బాల్ కావడంతో బ్రతికిపోయాడు. ఆ తర్వాత స్లిప్‌లో క్యాచ్ డ్రాప్ అవ్వడంతో లభించిన అవకాశాలను రూట్ పూర్తిగా సద్వినియోగం చేసుకుని అజేయ హాఫ్ సెంచరీతో జట్టును గెలిపించాడు. ఒత్తిడిని జయించిన జో రూట్, జోర్డాన్ కాక్స్ మూడో వికెట్‌కు 100కు పైగా పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. కాక్స్ కూడా తన అర్ధశతకాన్ని పూర్తి చేసుకుని ఇంగ్లాండ్ విజయాన్ని ఖరారు చేశాడు. చివరికి 24.2 ఓవర్లలో 130/2 పరుగులు చేసిన ఇంగ్లాండ్ సునాయాస విజయాన్ని అందుకుంది. ఈ ఓటమితో పాకిస్థాన్ ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ అవకాశాలు గల్లంతయ్యాయి. ఈ మ్యాచులో తొలుత బ్యాటింగ్ చేసిన పాక్ 133 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం ఇంగ్లాండ్ 453 పరుగులు చేసింది. అయితే రెండో ఇన్నింగ్స్‌లో పాక్ బ్యాటర్లు పోరాడారు. దీంతో ఈ సిరీస్‌లోనే తొలిసారి ఆ జట్టు స్కోరు 200 పరుగుల మార్కును దాటింది. చివరకు 449 పరుగులకు ఆ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో ఆలౌట్ అయింది. అనంతరం 130 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లాండ్.. 2 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించి.. సిరీస్‌ను 3-0తో క్లీన్ స్వీప్ చేసింది.

# 309 ఇన్నింగ్స్‌ల్లో 69వ అర్ధశతకం

### చరిత్ర సృష్టించిన ఇంగ్లాండ్ కెప్టెన్ రూట్



రెడ్ బాల్ క్రికెట్‌లో ఇంగ్లాండ్ రన్‌మెషీన్ జో రూట్ తన సూపర్ ఫామ్ కొనసాగిస్తూ సరికొత్త చరిత్ర సృష్టించాడు. టెస్టు క్రికెట్ చరిత్రలోనే అత్యధిక అర్ధశతకాలు సాధించిన బ్యాటర్‌గా టీమిండియా క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ పేరిట ఉన్న ఆల్‌టైమ్ వరల్డ్ రికార్డును రూట్ బద్దలు కొట్టాడు. ఎడ్జ్‌బాస్టన్‌లో పాకిస్థాన్‌తో జరిగిన మూడో టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో హాఫ్ సెంచరీ బాదడం ద్వారా రూట్ తన కెరీర్‌లో 69వ టెస్టు ఫిఫ్టీని నమోదు చేసుకున్నాడు. సచిన్ టెండూల్కర్ 329 ఇన్నింగ్స్‌ల్లో 68 ఫిఫ్టీలు సాధించగా, రూట్ కేవలం 309 ఇన్నింగ్స్‌ల్లోనే ఈ మార్కును దాటేశాడు. ఈ ఇన్నింగ్స్‌తో జో రూట్ మరో భారీ మైలురాయిని చేరుకున్నాడు. ఎడ్జ్‌బాస్టన్ మైదానంలో 1000 ప్లస్ టెస్టు పరుగులు పూర్తి చేసిన తొలి బ్యాటర్‌గా చరిత్ర పుటలకెక్కాడు. ఒకే వేదికపై నిలకడగా పరుగులు రాబడుతూ ప్రత్యర్థి బౌలర్లకు సింహస్వప్నంగా మారిన రూట్, ఈ మైదానంలో ఇంగ్లాండ్‌కు అనేక చారిత్రాత్మక విజయాలను అందించడంలో కీలక పాత్ర పోషించాడు. నాలుగు వేర్వేరు క్రికెట్ వేదికల్లో 1000 కంటే ఎక్కువ టెస్టు పరుగులు సాధించిన ప్రపంచంలోనే మూడో క్రికెటర్‌గా జో రూట్ నిలిచాడు. గతంలో లార్డ్స్ (2203 రన్స్), మాంచెస్టర్ (1128 రన్స్), ది ఓవల్ (1050 రన్స్) మైదానాల్లో వెయ్యికి పైగా పరుగులు చేసిన రూట్, ఇప్పుడు ఎడ్జ్‌బాస్టన్ (1000ం రన్స్)ను కూడా ఆ జాబితాలో చేర్చాడు. క్రికెట్ చరిత్రలో దక్షిణాఫ్రికా దిగ్గజం జాక్వెస్ కల్లిస్, ఆస్ట్రేలియా గ్రేట్ రికీ పాంటింగ్ మాత్రమే ఈ ఘనత సాధించగా, ఇప్పుడు రూట్ వారి సరసన నిలిచాడు. కాగా పాకిస్థాన్‌తో జరిగిన మూడో టెస్టులో ఇంగ్లాండ్.. 8 వికెట్ల తేడాతో గెలుపొందింది. దీంతో మూడు టెస్టుల సిరీస్‌ను 3-0తో క్లీన్ స్వీప్ చేసింది. ఇక ఇంగ్లాండ్, పాకిస్థాన్ టెస్ట్ సిరీస్‌లో ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా ఇంగ్లాండ్‌కు చెందిన ఓలీ రాబిన్సన్, పాక్ పేసర్ మహమ్మద్ అబ్బాస్ నిలిచారు.

# బుమ్రాను ఎదుర్కొనేందుకు మా వద్ద వ్యూహాలు ఉన్నాయి

### ధీమా వ్యక్తం చేసిన ఆఫ్ఘనిస్థాన్ కెప్టెన్ ఇబ్రహీం జద్రాన్

గాయం నుంచి కోలుకుని తిరిగి జట్టులోకి వస్తున్న టీమిండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రాను ఎదుర్కోవడానికి తమ వద్ద ప్రత్యేక వ్యూహాలున్నాయని ఆఫ్ఘనిస్థాన్ కెప్టెన్ ఇబ్రహీం జద్రాన్ ధీమా వ్యక్తం చేశాడు. ఆదివారం (సెప్టెంబరు 13) అరుణ్ జైట్లీ స్టేడియంలో జరగనున్న తొలి టీ20కి ముందు జద్రాన్ మీడియాతో మాట్లాడాడు. బుమ్రా రాకతో భారత బౌలింగ్ విభాగం పటిష్ఠంగా మారినప్పటికీ, అతడిని సమర్థంగా ఎదుర్కొంటామని స్పష్టం చేశాడు. "జస్ప్రీత్ బుమ్రా ప్రపంచంలోని అత్యుత్తమ బౌలర్లలో ఒకడు. నాకు ఇష్టమైన ఫాస్ట్ బౌలర్ కూడా అతడే. అయితే మేం ఏ విషయాన్నీ క్లిష్టంగా మార్చుకోం. అతడి కోసం మా వద్ద మంచి ప్రణాళిక ఉంది. అతడి బౌలింగ్‌ను ఎలా ఎదుర్కోవాలనే దానిపై స్పష్టమైన అవగాహనతో ఉన్నాం. బుమ్రాతో పాటు భారత జట్టుపైనా మెరుగైన ప్రదర్శన చేస్తామని ఆశిస్తున్నాం" అని జద్రాన్ తెలిపాడు. టీమిండియా యువ సంచలనం, లెఫ్ట్ హ్యాండ్ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీపై కూడా ప్రత్యేకంగా దృష్టి సారించామని జద్రాన్ వెల్లడించాడు. "ఐపీఎల్‌లో అతడిని ఎదుర్కొన్న మా జట్టు ఆటగాళ్ల నుంచి కీలక సమాచారం సేకరించాం. ఇప్పటికే అతడి వీడియోలను విశ్లేషించాం. సరైన సమయంలో సరైన ప్రణాళికలను అమలు చేయడంపైనే మా దృష్టి ఉంది" అని వివరించాడు. భారత్‌లో ఆడటం తమకు కొత్తేమీ కాదని, ఇక్కడి పరిస్థితులపై సంపూర్ణ అవగాహన ఉందని జద్రాన్ అన్నాడు. "గతంలో టీ20 ప్రపంచకప్, వన్డే ప్రపంచకప్‌లతో పాటు ద్వైపాక్షిక సిరీస్‌లు ఆడాం. 2024లో బెంగళూరులో జరిగిన టీ20లో రెండు సూపర్ ఓవర్ల వరకు మ్యాచ్ సాగింది. భారత్‌పై మేం ఎప్పుడూ మెరుగైన క్రికెట్ ఆడాం. అయితే ఇప్పటివరకు వారిపై సిరీస్ గెలవలేదు. ఈసారి ఆ రికార్డును బద్దలు కొట్టి సిరీస్ గెలవడమే మా లక్ష్యం" అని పేర్కొన్నాడు. రషీద్ ఖాన్ నుంచి టీ20 కెప్టెన్సీ బాధ్యతలు స్వీకరించడంపై మాట్లాడుతూ, తమ మధ్య మంచి అవగాహన ఉందని, ఇది జట్టుకు మేలు చేస్తుందని తెలిపాడు. కొత్త కోచ్ రిచర్డ్ పైబస్ మార్గదర్శకత్వంలో జట్టు మరింత మెరుగవుతోందని, గతంలో తాము బలహీనంగా ఉన్న అంశాలపై దృష్టి సారించి మెరుగుపరుచుకుంటున్నామని వివరించాడు. భారత గడ్డపై వారికే ఆతిథ్యమివ్వడం తమ క్రికెట్ చరిత్రలో ఒక అపూర్వ ఘట్టం అని జద్రాన్ అభివర్ణించాడు. కెప్టెన్‌గా ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలి, సరైన సమయంలో సరైన నిర్ణయాలు ఎలా తీసుకోవాలనే దానిపై దృష్టి పెడుతున్నానని, ఈ కొత్త బాధ్యతను ఆస్వాదిస్తున్నానని అన్నాడు.




# నా సినిమాలను నేను చూడలేను



ప్రముఖ బాలీవుడ్ నటి ప్రీతి జింటా కొంత కాలంగా సినిమాలకు దూరంగా ఉన్న సంగతి తెలిసిందే. కొంత విరామం తర్వాత ఆమె 'వైబ్' అనే యాక్షన్ కామెడీ మూవీతో పాటు 'బట్వారా 1947' చిత్రం గ్రాండ్ రీఎంట్రీ ఇస్తోంది. 'వైబ్'లో ఆమె 'మేడమ్ హెచ్' అనే పవర్‌ఫుల్ సూపర్ స్పై పాత్రలో కనిపించనున్నారు. వంశిక ధీర్, కునాల్ ఖేము, స్పర్ష్ శ్రీవాస్తవ ముఖ్య పాత్రలు పోషించిన ఈ చిత్రం సెప్టెంబర్ 18న ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా జరిగిన ప్రమోషన్లలో నటి వంశిక ధీర్ మాట్లాడుతూ... పెద్ద తెరపై తనను తాను చూసుకున్నప్పుడు 'ఇంపాస్టర్ సిండ్రోమ్' అనిపించిందని చెప్పగా, ప్రీతి జింటా ఆసక్తికరంగా స్పందించింది. ఇన్ని ఏళ్ల అనుభవం ఉన్నా, ప్రతి కొత్త పాత్ర చేసేటప్పుడు 'చేయగలనా, లేదా?' అనే సందేహం తనకూ వస్తుందని ఆమె చెప్పింది. "నేను నా సినిమాలను స్క్రీన్ పై ఎప్పుడూ చూడలేను. థియేటర్‌లో కూర్చోవడం చాలా ఇబ్బందిగా ఉంటుంది. సినిమా చూస్తున్నంతసేపు ఈ సీన్ ఇంకా బాగా చేసి ఉంటే బాగుండేది అనే ఆలోచనే వస్తుంది" అని ప్రీతి వెల్లడించింది.

# నవ్వులు పూయిస్తున్న 'ఆదర్శ కుటుంబం' టీజర్


వెండితెరపై కుటుంబ కథా చిత్రాలకు సరికొత్త నిర్వచనం చెప్పిన విక్టరీ వెంకటేష్ , మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్లో తెరకెక్కిన మోస్ట్ క్రేజీ ప్రాజెక్ట్ 'ఆదర్శ కుటుంబం'. మొదటి నుంచి సినీ ప్రియులను విశేషంగా ఆకర్షిస్తున్న ఈ చిత్రం నుంచి ఎట్టకేలకు ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూసిన టీజర్ అధికారికంగా విడుదలైంది. తొలుత ప్రకటించిన సమయానికి కాస్త ఆలస్యమైనప్పటికీ చిత్ర బృందం రీ-షెడ్యూల్ చేసిన సమయానికి టీజర్‌ను యూట్యూబ్ వేదికగా విడుదల చేసి అభిమానులకు పసందైన వినోదాన్ని పంచింది. తాజాగా విడుదలైన 'ఆదర్శ కుటుంబం' టీజర్ ఆద్యంతం ఆహ్లాదకరమైన వినోదం, ఆకట్టుకునే భావోద్వేగాలతో సాగింది. విక్టరీ వెంకటేష్ మార్క్ సహజ నటన, టైమింగ్‌తో పలికించిన సంభాషణలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మరోవైపు త్రివిక్రమ్ తనదైన శైలి చమత్కారమైన డైలాగ్స్, కుటుంబ బంధాల ప్రాధాన్యతను చాటే సన్నివేశాలతో మరోసారి మ్యాజిక్ చేశారు. వెంకీలోని ఫ్యామిలీ మ్యాన్ ఇమేజ్‌ను, త్రివిక్రమ్ రాతలోని పదునును సరిగ్గా మేళవించి ఈ చిత్రాన్ని పూర్తిస్థాయి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా మలిచినట్లు టీజర్ స్పష్టం చేస్తోంది. డబ్బుకి సబ్బుకి ఓ పోలికుంది... మొదటిది చూస్తుండగానే కరిగిపోద్ది, రెండో ఆలోచించేలోపే అరిగిపోద్ది, అడుక్కునేవాళ్లకైనా ఆదివారం ఉంటుంది గానీ ఈ అప్పులోళ్లకి ఉండదు' అనే డైలాగ్స్ త్రివిక్రమ్ మార్క్‌ని చూపిస్తున్నాయి. ఈ చిత్రంలో కేజీఎఫ్ ఫేమ్ శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తుండటంతో మొదటి నుంచే ఈ జోడీపై ప్రేక్షకుల్లో విపరీతమైన ఆసక్తి ఉంది. టీజర్‌లో ఆమె స్క్రీన్ ప్రెజెన్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వెంకటేష్‌తో ఆమె మధ్య వచ్చే సన్నివేశాలు చాలా ఫ్రెష్‌గా ఉండటంతో పాటు ఆమె పాత్రకు కూడా కథలో బలమైన ప్రాధాన్యత ఉన్నట్లు విజువల్స్ చూస్తే అర్థమవుతోంది. ఇప్పటివరకు సినిమా నేపథ్యంపై పూర్తి గోప్యత పాటించిన చిత్ర బృందం.. ఈ టీజర్ ద్వారా కథా వాతావరణాన్ని, పాత్రల స్వభావాన్ని పరిచయం చేస్తూ అంచనాలను ఒక్కసారిగా రెట్టింపు చేసింది. ఫ్యామిలీ ఫన్, ఎమోషన్స్‌తో పాటు క్రైమ్ అంశాలు కూడా ఈ కథలో జోడించినట్లుగా టీజర్ చూస్తుంటే అర్థమవుతోంది. మరోవైపు ఈ మూవీ రిలీజ్ వాయిదా అంటూ జరుగుతోన్న ప్రచారానికి మేకర్స్ మరోసారి చెక్ పెట్టారు. 'ఆదర్శ కుటుంబం' అక్టోబర్ 2నే థియేటర్లలోకి రానుందని టీజర్ ద్వారా అధికారికంగా ప్రకటించారు.



# తెలుగులోకి 'హనుమాన్ అంశ్'

రూ. 2 కోట్లతో తీసిన సినిమా బాక్సాఫీస్ వద్ద రూ. 150 కోట్లకు పైగా కలెక్ట్ చేసిందంటే ఎవరైనా షాక్ అవ్వాల్సిందే. అది కూడా ఎలాంటి స్టార్ కాస్ట్, ప్రమోషన్లు, అంచనాలు లేకుండా సైలెంట్ బాలీవుడ్ లో రిలీజ్ అయిన ఓ చిన్న సినిమా గురించి ఇప్పుడు యావత్ దేశం మొత్తం మాట్లాడుకుంటుంది. అదే "హనుమాన్ అంశ్" చిత్రం.. ఈ సినిమాను ఇంతలా ఆదరించడానికి గల కారణం ఏంటి..? అని అనుకుంటున్నారా..? ఆధ్యాత్మిక గురువు నీమ్ కరోలీ బాబా జీవితం ఆధారంగా ఈ సినిమా రూపొందింది. కేవలం ప్రేక్షకుల మౌత్ టాక్ తో పుంజుకుని ఇప్పుడు ఏకంగా రూ. 150 కోట్లకు పైగా కలెక్షన్లు కొల్లగొట్టింది. అయితే ఇప్పుడు ఈ మూవీ తెలుగులోనూ రాబోతోంది. టాలీవుడ్ ప్రముఖ దర్శకుడు, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ హనుమాన్ అంశ్ సినిమాను తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. త్రివిక్రమ్ సమర్పణలో ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 18 న తెలుగు రాష్ట్రాల్లో రిలీజ్ చేయనుంది. నీమ్ కరోలి బాబా భక్తుల భావోద్వేగాలను, ఆయన జీవితంలోని ముఖ్య ఘట్టాలను అద్భుతంగా ఆవిష్కరించిన ఈ ఆధ్యాత్మిక సినిమా తెలుగు ప్రేక్షకులను కూడా ఎంతగానో ఆకట్టుకుంటుందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది. భక్తి రస చిత్రాలను ఆదరించడంలో తెలుగు ప్రేక్షకులు ముందుంటారు. ఆ కారణంతోనే ఈ సినిమాను తెలుగులోనూ రిలీజ్ చేసేందుకు చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోంది. ఇక హనుమాన్ అంశ్ చిత్రానికి విశాల్ చతుర్వేది దర్శకత్వం వహించారు. అలాగే ఈ చిత్రంలో శోభినావ్ సత్య, విహాన్ శెడ్గే ప్రధాన పాత్రల్లో నటించారు.

# కొత్త సినీ యుగానికి శ్రీకారం శ్రీమద్భాగవతం




సాగర్ పిక్చర్స్ ఎంటర్‌టైన్‌మెంట్ భారతీయ సినిమా ప్రపంచంలో ఒక నూతన శకానికి శ్రీకారం చుడుతోంది. ఒకప్పుడు 'రామాయణ్', 'శ్రీ కృష్ణ' వంటి అజరామరమైన దృశ్య కావ్యాలతో కోట్లాది మంది భారతీయుల ఇళ్లల్లో, హృదయాల్లో భక్తిపరవశాన్ని నింపిన రామానంద్ సాగర్ కుటుంబం.. ఇప్పుడు అదే ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వాన్ని వెండితెరపై అత్యంత వైభవంగా ఆవిష్కరించేందుకు సిద్ధమైంది. భారతీయ పురాణ చరిత్రలోనే అత్యంత విస్తృతమైన కథా సముద్రం 'శ్రీమద్భాగవతం'. ఈ పవిత్ర గాథను కేవలం రెండు మూడేళ్ల వ్యవధిలో లేదా ఒకే సినిమాలో చూపించడం సాధ్యం కాదు. అందుకే దీనిని ఒక భారీ సినిమాటిక్ యూనివర్స్‌గా మలచి, మొత్తం ఏడు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. ఈ ఆధ్యాత్మిక మహాగాథలో తొలి అడుగుగా 'శ్రీమద్భాగవతం: పార్ట్ వన్ - విష్ణురథ' రూపుదిద్దుకుంటోంది. దివంగత రామానంద్ సాగర్ వారసత్వపు బాధ్యతలను ఆయన మనవళ్లు ఆకాశ్ సాగర్ చోప్రా, అమృత్ సాగర్ తమ భుజస్కంధాలపై వేసుకున్నారు. '1971' చిత్రంతో జాతీయ చలనచిత్ర పురస్కారాన్ని అందుకున్న అమృత్ సాగర్, అనుభవజ్ఞుడైన ఆకాశ్ సాగర్‌తో కలసి ఈ ప్రతిష్టాత్మక చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. పాత తరం భావోద్వేగాలను, భక్తి శ్రద్ధలను కాపాడుతూనే.. నేటి తరం ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఆధునిక సినిమాటిక్ శైలిలో ఈ కథను మలుస్తున్నారు. హైదరాబాద్‌లోని ప్రసిద్ధ రామోజీ ఫిల్మ్ సిటీలో వైభవంగా ప్రారంభమైన ఈ ప్రాజెక్ట్ కోసం అత్యంత భారీ సెట్లు, అద్భుతమైన ప్రొడక్షన్ డిజైన్‌ను సిద్ధం చేస్తున్నారు. ఈ ప్రాచీన పౌరాణిక ప్రపంచాన్ని విజువల్ వండర్‌గా మార్చేందుకు అంతర్జాతీయ సాంకేతిక నిపుణులు భాగస్వాములవుతున్నారు. వంటి ప్రపంచ ప్రసిద్ధ చిత్రాలు, సిరీస్‌లకు పనిచేసిన ప్రముఖ విజువల్ ఎఫెక్ట్స్ నిపుణుడు క్లైడ్ ఎడ్వర్డ్స్ ఈ చిత్రానికి పనిచేస్తుండటం విశేషం. కేవలం గ్రాఫిక్స్ కోసమే కాకుండా, కథలోని ఆధ్యాత్మిక లోతును, సాంస్కృతిక మూలాలను చెడగొట్టకుండా అత్యాధునిక సాంకేతికతతో దృశ్య రూపం ఇస్తున్నారు. ఇది కేవలం మరొక భక్తి చిత్రం కాదు, సాంస్కృతిక మూలాలు, కుటుంబ వారసత్వం, ఆధునిక సాంకేతికత , భారీ నిర్మాణం కలగలిసిన ఒక అరుదైన సినీ ప్రయోగం. మన ప్రాచీన పురాణ వైభవాన్ని నేటి ఆధునిక తరానికి వారి భాషలోనే, అంతర్జాతీయ ప్రమాణాలతో అందించడమే లక్ష్యంగా 'విష్ణురథ' థియేటర్లలోకి రాబోతోంది. రామాయణంతో మొదలైన సాగర్ కుటుంబ పయనం.. ఇప్పుడు 'శ్రీమద్భాగవతం'తో భారతీయ వెండితెరపై ఒక నూతన విజువల్ వండర్‌కు తెరదీస్తోంది.

# స్పై డ్రామాతో సీక్రెట్ సోల్జర్..

నిహాల్ కోదాటి, సూర్య శ్రీనివాస్ హీరోలుగా అక్కి విశ్వనాథ్ రెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న యూనిక్ స్పై డ్రామా 'సీక్రెట్ సోల్జర్'. మూన్ లైట్ డ్రీమ్స్ బ్యానర్‌పై తెరకెక్కిన ఈ చిత్రంలో కమల్ కామరాజు, రఘుబాబు, రంగస్థలం మహేష్, శ్రీనివాస్ వడ్లమాని, శ్రీకాంత్ అయ్యంగార్ కీలక పాత్రలు పోషించారు. ఇప్పటికే ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ మంచి బజ్‌ను క్రియేట్ చేసింది. యూనిక్ కాన్సెప్ట్, ఆకట్టుకునే ప్రెజెంటేషన్, యాక్షన్, థ్రిల్, హ్యూమర్ ఎలిమెంట్స్‌తో విడుదలైన టీజర్ ట్రైలర్ సినిమాపై అంచనాలను మరింత పెంచింది. ఈ చిత్రం సెప్టెంబర్ 18న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా నిహాల్ కోదాటి, సూర్య శ్రీనివాస్ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు. 'చైనా పీస్'గా మొదలైన ప్రయాణం 'సీక్రెట్ సోల్జర్'గా ఎలా మారింది అన్న ప్రశ్నకు సమాధానమిస్తూ.. 'చైనా పీస్' పేరుతోనే టీజర్ రిలీజ్ చేశాను. అలాగే రెండు పాటలు కూడా విడుదల చేశాను. అదే పేరుతో చాలా మార్కెటింగ్ చేశాం. మార్చిలో సినిమా రిలీజ్ చేద్దామని సెన్సార్‌కు పంపించాను. సెన్సార్ నుంచి అభ్యంతరాలు వచ్చాయి. రివ్యూ కమిటీలు, ఈబీసీ చైర్మన్, మినిస్ట్రీ ఆఫ్ ఎక్స్‌టర్నల్ అఫైర్స్.. ఇలా అన్ని స్థాయిలు దాటుకుని లిస్టు పంపించారు. అందులో మొదటి పాయింట్.. టైటిల్ 'చైనా పీస్' ఉండకూడదు. ఈ కథ ఆలోచన, ఉద్దేశంతో ఆలోచించుకుని 'సీక్రెట్ సోల్జర్' అయితే బాగుంటుందని ఆ టైటిల్ పెట్టాం. సెన్సార్‌లో దాదాపు 8 నెలలు ఈ సినిమా ఉన్నప్పటికీ, మేం ఏ ఆలోచనతో సినిమా తీశామో.. ఆ ఆలోచన విషయంలో ఎలాంటి ఇబ్బంది రాలేదు. మా డైరెక్టర్ విశ్వనాథ్ గారు చాలా కష్టపడ్డారు. కంటెంట్ విషయంలో తగ్గించడానికి ఎక్కడా కూడా రాజీ పడలేదు. విజువల్స్ పరంగా చాలా చిన్న కట్స్ మాత్రమే వచ్చాయి. ఇది స్పై డ్రామా. ఇందులో స్పై యాక్షన్ కూడా చాలా రియలిస్టిక్‌గా ఉంటుంది. ఇండియా కి సంబధించిన ఓ కీలక ఇన్ఫర్మేషన్ లీక్ అయింది. ఆ సంఘటనకి నెల్లూరులో చాలా సాదాసీదాగా బతికే ఇద్దరు కుర్రాళ్లకి లింక్ ఏమిటి? ఆ సమస్యను పరిష్కరించగలిగారా లేదా? అనేది ఒక లైన్. ఫస్ట్ హాఫ్ లో ఫ్రెండ్‌షిప్ ఎమోషన్స్ చాలా బాగుంటాయి. మా ఇద్దరి క్యారెక్టర్స్ ఈ వరల్డ్‌లోకి ఎలా వచ్చాయి అనేది చాలా ఆసక్తికరంగా ఉంటుంది. మంచి హ్యూమర్, ట్విస్టులు ఉంటాయి. ఫైనల్‌గా సినిమా ఒక మంచి ఫ్రెండ్‌షిప్ కథగా కూడా ఉంటుంది. స్నేహం, దేశభక్తి.. ఈ రెండు ఎమోషన్స్‌తో ఇప్పటివరకు చాలా తక్కువ సినిమాలు వచ్చాయి. ఇందులో అలాంటి ఒక కొత్త ఎమోషన్‌ను ఆడియన్స్ చూడబోతున్నారు. కచ్చితంగా ఈ సినిమాతో మమ్మల్ని గుర్తుపెట్టుకుంటారు అని చెప్పుకొచ్చారు.




Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **7036644111, 9490140565**

# వినాయక చవితి ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలి





- **డీజేలకు అనుమతి లేదు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ..కోస్గి సీఐ సైదులు**

**కోస్గి మున్సిపల్, సెప్టెంబర్, 12 (సమయం న్యూస్)** గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రజలంతా శాంతియుత వాతావరణంలో, సామరస్యంగా జరుపుకోవాలని కోస్గి సీఐ సైదులు,ఎస్సై చంద్రశేఖర్ లు సూచించారు.శనివారం జిల్లా ఎస్పీ వినీత్ ఆదేశాల మేరకు కోస్గి పోలీస్‌స్టేషన్ ఆవరణలో గణేష్ మ ండ పాల నిర్వాహకులు,హిందూ,ముస్లిం మత పెద్దలతో శాంతి సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐ సైదులు మాట్లాడుతూ గణేష్ మండపాల నిర్వాహకులు వినాయక విగ్రహాలకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని పోలీస్ పోర్ట ల్‌తో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని అన్నారు. మండపాల వద్ద పోలీసుల సూచనలు, నిబంధనలు పాటించాలను తప్పనిసరిగా పాటించాలని అన్నారు.మండల పరిధిలో ఉత్సవాల సందర్భంగా డీజేలకు అనుమతి లేదని ఆయన స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా డీజేలు ఏర్పాటు చేస్తే వాటిని సీజ్ చేయడంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.అల్ల ర్లు , గొడవలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. పండుగల సమయంలో ప్రజలు సంయమనం పాటిస్తూ పరస్పర సహకారంతో ఉత్సవాలను నిర్వహిం చాలని తెలిపారు.అదేవిధంగా సోషల్ మీడియాలో ఒక మతం లేదా వర్గాన్ని కించపరిచేలా పోస్టులు, వ్యాఖ్యలు చేయవద్దని హెచ్చరించారు. అలాంటి అభ్యంతరకర పోస్టులు చేసే వారితో పాటు సంబంధిత గ్రూప్ అడ్మిన్‌లపై కూడా చట్టప్రకారం చర్యలు తీసుకుం టామని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు వెంటనే డయల్ 112కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజయకుమార్, మున్సిపల్ చైర్మన్ నాగులపల్లి నరేందర్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి అన్న కిష్టప్ప,మండల పార్టీ అధ్యక్షుడు రఘువర్ధన్ రెడ్డి,పీఏ సిఎస్ వైస్ చైర్మన్ వేణుగోపాల్ పట్టణ, అధ్యక్షుడు బెజ్జు రాములు,కౌన్సిలర్లు మేకల రాజేష్,హరి కుమార్,మాస్టర్ శ్రీనివాస్, భానునాయక్, తుడుం శ్రీనివాస్, నాయకులు వెంకట్ రాం రెడ్డి, ఇద్రిస్, టెంట్ నర్సిములు,బాలేష్, బాలరాజు, మడుగు వెంక ట య్య, సోమ శేఖ ర్, స ర్పంచులు సంఘం మండల అధ్యక్షుడు సుధాకర్ గౌడ్,బోగారం సర్పంచ్ శేఖర్ గౌడ్,బిజ్జారం సర్పంచ్ విద్యాసాగర్, గణేష్ మండపాల నిర్వాహకులు,ఇరువర్గాల మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# సిరివెన్నెల కుటుంబానికి ముదిరాజ్ సమితి చేయూత

**సిరివెన్నెల కుటుంబానికి రూ.20 వేల ఆర్థిక సాయం**



**నల్లబెల్లి/వరంగల్, సెప్టెంబర్ 12 (సమయం న్యూస్) :** ఆపదలో ఉన్న నిరుపేద ముదిరాజ్ కుటుంబానికి పీఆర్ ముదిరాజ్ సేవా సమితి అండగా నిలిచింది. నల్లబెల్లి మండల కేంద్రానికి చెందిన పిట్ట ల రమేష్ ముదిరాజ్ చిన్నకూతురు సిరివెన్నెల విద్యుదాఘాతంతో మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని పరామర్శించిన సమితి ప్రతినిధులు రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు.సిరివెన్నెల చిత్రప టానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం నర్సంపేట నియోజకవర్గ నాయకులు ఓరుగంటి తిరుపతి ముదిరాజ్ సూచన మేరకు, సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు పెసరు రాజన్న ముదిరాజ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండు చిరంజీవి ముదిరాజ్ సూచనలతో దాతల సహకారంతో ఈ సాయాన్ని అందించారు. పీఆర్ ముదిరాజ్ సేవా సమితి జిల్లా బాధ్యులు తాళ్ల రవీందర్ ముదిరాజ్, పోలుదాసరి రమేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి చెక్కు/నగదు అందజేశారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు పీఆర్ ముదిరాజ్ సేవా సమితి బాసటగా నిలవడం అభినందనీయమన్నారు. సేవా కార్యక్రమాల ద్వారా సమాజంలో మంచి గుర్తింపు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి పేద కుటుంబాలకు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఆర్ ముదిరాజ్ సేవా సమితి రాష్ట్ర నాయకులు పులి సదానందం ముదిరాజ్, సింగారపు రామకృష్ణ ముదిరాజ్, సామాజిక వేదిక, ముదిరాజ్ సంఘం భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు ఆకుల సుభాష్ ముదిరాజ్, జిల్లా బాధ్యులు తాళ్ల రవీందర్ ముదిరాజ్, పోలుదాసరి రమేష్ ముదిరాజ్, ఎలబోయిన రాజు ముదిరాజ్, హనుమకొండ జిల్లా బాధ్యులు వాసు శ్రీనివాస్ ముదిరాజ్, అమ్మగారి శ్యామ్ ముదిరాజ్, నర్సంపేట డివిజన్ నాయకులు ముద్రబోయిన రమేష్ ముదిరాజ్, దుగ్గొండి మండల కార్యదర్శి పొన్నం రాజు ముదిరాజ్, జెట్టబోయిన శివ, స్థానిక సర్పంచి ప్రకాష్, మాజీ సర్పంచి గోనెల నరహరి ముదిరాజ్, కుల పెద్దలు పాండవుల రాంబాబు ముదిరాజ్, పిట్ట ల రామస్వామి ముదిరాజ్, ముదిరాజ్ కుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# రాజీతోనే సమస్యలకు శాశ్వత పరిష్కారం

- **కక్షిదారులకు ఊరట.. 656 కేసులు పరిష్కారం**
- **లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం...సీనియర్‌సివిల్ జడ్జి ప్రతీక్ సిహాగ్**

**నర్సంపేట, సెప్టెంబరు 12 (సమయం న్యూస్) :** రాజీ చేసుకోదగిన కేసుల్లో ఇరు వర్గాలు పరస్పర అంగీకారంతో రాజీకి రావడం ద్వారా కేసుల భారాన్ని తగ్గించుకోవడంతో పాటు సత్వర న్యాయం పొందవచ్చని సీనియర్ సివిల్ జడ్జి, తాలూకా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్ ప్రతీక్ సిహాగ్ అన్నారు. 'రాజీమార్గమే.. రాజమార్గం' అని పేర్కొంటూ కక్షిదారులు లోక్ అదాలత్‌ను సద్విని యోగం చేసుకోవాలని సూచించారు. జాతీయ లోక్ అదాలత్‌లో భాగంగా శనివారం నర్సంపేట కోర్టులో నిర్వహించిన లోక్ అదాలత్‌కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాజీ పడదగిన కేసుల్లో ఇరు వర్గాలు అంగీకారానికి వస్తే వెంటనే కేసును పరిష్కరించి కక్షిదారులకు సత్వర న్యాయం అందించే అవకాశం ఉంటుందని తెలిపారు. చిన్నచిన్న వివాదాలను కోర్టు ల వరకు తీసుకెళ్లకుండా పరస్పర అవగాహనతో పరిష్కరించుకోవడం ద్వారా సమయం, ధనం ఆదా అవుతాయని పేర్కొన్నారు.

**656 కేసులకు పరిష్కారం...**

నర్సంపేట కోర్టులో నిర్వహించిన లోక్ అదాలత్‌లో మొత్తం 656 కేసులు పరిష్కారమయ్యాయి. ఇందులో రాజీ కుదిరిన కేసులు 74, నేరం అంగీకరించిన కేసులు 150, సివిల్ కేసు ఒకటి, బ్యాంకు కేసులు 14, పెట్టి కేసులు 411, ఎక్సైజ్ కేసులు 5 ఉన్నాయి.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.డి. యూసుఫ్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి గిరిధర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సిలువేరు కిరణ్‌కుమార్, లోక్ అదాలత్ సభ్యులు షేక్ రహీముద్దీన్, దొంతి సాంబయ్య, మోటూరి రవి, ఏజీపీ అంబటి రాజకుమార్, న్యాయవాదులు టి.సునీత, అంబాల సుధీర్, పండుగ శ్రీనివాస్, పాలడుగుల ప్రవీణ్, సీఐలు, ఎస్సైలు, బ్యాంకు సిబ్బంది, కక్షిదారులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# సీతారాం ఏచూరి మార్క్సిస్టు మహా మేధావి

- **ఆయన మరణం భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని నష్ట ం.**
- **సిర్పంగి స్వామిసిపిఎం మండల కార్యదర్శి.**



**వలిగొండ సెప్టెంబర్ 12 (సమయం న్యూస్)** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం సిపిఎం మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి మాజీ రాజ్యసభ సభ్యులు సీతారాం ఏచూరి గొప్ప మార్క్సిస్టు మహా మేధావని ఆయన మరణం భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని నష్టమని సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి అన్నారు. శనివారం రోజున సిపిఎం వలిగొండ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని సీతారాం ఏచూరి ద్వితీయ వర్ధంతి సిపిఎం కార్యాలయం వద్ద జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు అనంతరం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి మాట్లాడుతూ సీతారాం ఏచూరి గొప్ప మార్క్సిస్టు మహా మేధావని ఆయన మరణం సిపిఎం ఉద్యమానికే కాకుండా దేశ కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని నష్టమని అన్నారు. దేశాన్ని పట్టి పీడిస్తున్న మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడుతూ కమ్యూనిస్టు పార్టీలను ఐక్యం చేసిన గొప్ప నాయకుడని అన్నారు. యూపీఏ మొదటి ప్రభుత్వంలో అనేక చట్టాలను సాధించడంలో వాటిని రూపకల్పన చేయడంలో క్రియాశీలకంగా పనిచేసిన మేధావన్నారు. ఉపాధి హామీ చట్టం,అటవీ హక్కుల చట్టం సమాచార హక్కు చట్ట ం లాంటి చట్టాలను ప్రజలకు అందించాలని దృఢ సంకల్పంతో పనిచేసిన నాయకు డన్నారు గత 40 సంవత్సరాల నుండి దేశ రాజకీయాల్లో విద్యార్థి ఉద్యమాల నుండి మొదలుకొని యువజన,కార్మిక ప్రజా పోరాటాల్లో కీలక పాత్ర పోషించారని దేశం ఒక సామాజిక వేత్తను కోల్పోయిందని అన్నారు. రాజ్యసభ సభ్యులుగా దేశవ్యాప్తంగా ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై పోరాడి కేంద్ర బిజెపి ప్రభుత్వాన్ని మెడలు వంచడంలో కీలక పాత్ర పోషించిన గొప్ప నాయకున్ని కోల్పోవడం ప్రజలకు, ప్రజాస్వామిక వాదులకు, కమ్యూనిస్టు పార్టీ లకు తీరని లోటని ఆయన ఆశయ మార్గంలో మతో న్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలని అప్పుడే ఆయన ఆశయాలను సాధించిన వారమవుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు కూర శ్రీనివాస్,దుబ్బ లింగం, పట్టణ కార్యదర్శి గర్దాసు నరసింహ,నా యకులు, వేముల లక్ష్మయ్య, కొండూరు సత్తయ్య,శీలం ఇందిర,ద్యానబోయిన యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

## కొడంగల్‌లో ఘనంగా శ్రావణ మాస ముగింపు వేడుకలు

**మున్సిపల్ మాజీ చైర్మన్ ఆర్.జగదీశ్వర్ రెడ్డి నేతృత్వంలో ప్రత్యేక పూజలు**



**కొడంగల్ మున్సిపల్, సెప్టెంబర్12,(సమయం న్యూస్)** శ్రావణ మాస ముగింపును పురస్కరించుకొని కొడంగల్ పట్టణంలోని చిత్తారు పెరుమాళ్ల దేవస్థానంలో భక్తుల భక్తిశ్రద్ధలతో శనివారం ఉదయం మున్సిపల్ మాజీ చైర్మన్ ఆర్. జగదీశ్వర్ రెడ్డి నేతృత్వంలో భక్తులు స్వామివారికి అభిషేకాలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. నెల రోజులపాటు ఆలయంలో భక్తులు మేళతాళాలు, భజనలు, స్వామివారి జైజై నినాదాలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పారు. శ్రావణ మాస ముగింపు సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లి ంచుకున్నారుఅనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

## విద్యార్థులకు సీసనల్ వ్యాధుల పట్ల తీసుకోవాలని జాగ్రత్తలపై అవగాహన

**DM&HO డాక్టర్. సుధాకర్ లాల్ ఆదేశానుసారం**



**కొడంగల్, సెప్టెంబర్,12(సమయం న్యూస్)** వికారాబాద్ జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖధికారి డాక్టర్ సుధాకరలాల్ ఆదేశానుసారం శనివారం కొడంగల్ సబ్ –యూనిట్ అధికారి ఎస్ పకీరప్ప, మరియు జి. అశ్వినిMLHP కలిసి కొడంగల్ పట్టణ కేంద్రంలో గల గిరిజన బాలుర వసతి గృహం, మరియు బాలికల సామూహిక వసతి గృహలను సందర్శించి వైద్య శిబిర్యాలను నిర్వహించారు.శిబిరంలో విద్యార్థుల ఆరోగ్య స్థితి గతులను అడిగితెలుసుకొని అవసరమైనవారికి మందులు ఇవ్వడం జరిగింది. వైద్య శిబిరంలో భాగంగా సబ్ –యూనిట్ అధికారి ఎస్. పకీరప్ప మాట్లా డుతూ..విద్యార్థులకు సీసనల్ వ్యాధులు మలేరియా,డెంగ్యూ,మెదడువాపు, పట్ల తీసుకోవలసిన జాగ్రత్తల పైన ఆరోగ్య అవగాహనా కల్పించారు.ప్రతి ఒక్కరు వ్యక్తి గత పరిశుభ్రత మరియు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు మరియు విదర్థులందరు మనోధైర్యాన్ని కలిగిఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో, ఇంటిగ్రేటెడ్ వసతి గృహం వార్డెన్ నిర్మల, వార్డెన్ వరలక్షి , ఆశా కార్యకర్తలు సులోచన,సునీత,అనిత, ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉద్యోగి మృతి



**శంషాబాద్ సమయం సెప్టెంబర్ 12:** రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉద్యోగి మృతి చెందిన సంఘటన శనివారం శంషాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సిఐ సురేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ నగరానికి చెందిన సయ్యద్ జహీరుద్దీన్ అహ్మద్( 57) షాద్ నగర్ లో మహిళా, శిశు సంక్షేమ శాఖ ఉద్యోగిగా పనిచేస్తున్న ఆయన శనివారం ఉదయం ఆయన తన Ola స్కూటీ నంబర్ TS 11 EZ 0038పై తన నివాసం నుండి విధులకు షాద్‌నగర్ వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో వెనుక వైపు నుండి వచ్చిన గుర్తుతెలియని వాహనం అధిక వేగంతో, అజాగ్రత్తగా మరియు నిర్లక్ష్యంగా నడుపుతూ స్కూటీని ఢీకొవడంతో సయ్యద్ జహీరుద్దీన్ అహ్మద్ రోడ్డుపై పడిపోగా, తలకు మరియు శరీరంలోని ఇతర భాగాలకు తీవ్ర రక్తస్రావ గాయాలు కావడంతో సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. ఈ మెరిట్ కేస్ నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. సిసి ఫుటేజ్ ఆధారంగా కేసును దర్యాప్తు చేస్తామని వివరించారు.

## అక్రమంగా తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్ట ర్లు పట్టి వేత

**బొంరస్ పేట ఎస్సై బాల వెంకటరమణ**



**బొంరస్ పేట మండలం, సెప్టెంబర్,12(సమయం న్యూస్)** బొంరాస్ పేట మండలంలోని దుప్చెర్ల సమీపంలో కాకరవాణి వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్ట ర్లను శనివారం పట్టుకొని యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై బాల వెంకటరమణ తెలిపారు. ప్రభుత్వా అనుమతులు లేకుండా అక్రమ ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

# గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకుల సమావేశం



**వలిగొండ సెప్టెంబర్ 12 (సమయం న్యూస్)** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం ఎస్పీ అక్షాంశ్ యాదవ్ ఐపీఎస్ ఉత్తర్వుల మేరకు రామన్నపేట సిఐ ఆధ్వర్యంలో వలిగొండ పోలీస్ స్టేషన్ పరిధిలో మండలంలోని గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఇట్టి సమావేశంలో రామన్నపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ మొలుగూరి రవి, వలిగొండ సబ్ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్ రెడ్డి పాల్గొని మండల ప్రజలందరూ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని డీజే లకు ఎలాంటి అనుమతులు లేవని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకొని ఉత్సవాలు నిర్వహించుకోవాలని సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల గణేష్ ఉత్సవ కమిటీల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ, బీఆర్ ఎస్ కుమ్మక్కు రాజకీయాలు

### సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షుడు దీపక్ జాన్



**సికింద్రాబాద్, సెప్టెంబర్ 12( సమయం న్యూస్):** ఓట్ల తొలగింపునకు ఎస్ఐఆర్ ప్రక్రియను బీజేపీ రాజకీయ ఆయుధంగా వాడుతోందని సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షుడు దీపక్ జాన్ ఆరోపించారు. ముషీరాబాద్‌లో జరిగిన కాంగ్రెస్ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రజల ఓటు హక్కును కాపాడేందుకు కాంగ్రెస్ అప్రమత్తంగా పనిచేస్తోందన్నారు. అసెంబ్లీని స్తంభింపజేసేందుకు బీఆర్ఎస్ నేతలు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. బీజేపీ, బీఆర్ఎస్ ఎన్ని కుట్రలు చేసినా ప్రజల పక్షాన కాంగ్రెస్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# లాలాగూడ, మెట్టు గూడ వర్క్షాప్లను తనిఖీ చేసిన ఎస్సీఆర్జీఎం



**హైదరాబాద్, సెప్టెంబర్ 12:( సమయం న్యూస్)** దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ శనివారం లాలాగూడలోని ఇంజనీరింగ్ వర్క్‌షాప్, మెట్టుగూడలోని సిగ్నల్ అండ్ టెలికమ్యూనికేషన్ (ఎస్&టి) వర్క్‌షాప్‌లను తనిఖీ చేశారు. లాలాగూడ వర్క్‌షాప్‌లో వెల్డింగ్, ఫ్యాబ్రికేషన్ ప్రమాణాలు, గ్లూడ్ జాయింట్ తయారీ ప్రక్రియలు, భద్రతా చర్యలను పరిశీలించారు. సిబ్బంది సంక్షేమం, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. మెట్టుగూడ ఎస్&టి వర్క్‌షాప్‌లో పాయింట్ మెషీన్, ఎలక్ట్రికల్ షాప్‌లను పరిశీలించిన జీఎం, నూతనంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్ న్యూమరికల్ కంట్రోల్ (సీఎన్‌సీ) బెండింగ్ మెషీన్‌ను ప్రారంభించారు. అనంతరం కార్మిక సంఘాల ప్రతినిధులతో సిబ్బంది సంక్షేమ అంశాలపై చర్చించి, మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ పర్యటనలో పలువురు సీనియర్ రైల్వే అధికారులు పాల్గొన్నారు.

# 108 డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు పారదర్శకంగా డ్రా



**జనగామ, సెప్టెంబర్ 12:( సమయం న్యూస్)** ఘనపూర్ (స్టేషన్) నియోజకవర్గంలోని ఘనపూర్ (స్టేషన్), లింగాల ఘనపురం, జఫర్గడ్ మండలాల పరిధిలోని 108 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధ్యక్షతన శనివారం కలెక్టరేట్‌లో డ్రా నిర్వహించారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్ పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల L2 జాబితా, ప్రజావాణి దరఖాస్తులు, ప్రజాప్రతినిధులు అందజేసిన పేర్ల ను సమీకరించి అర్హుల జాబితా రూపొందించినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లా స్థాయి కమిటీ సమక్షంలో వీడియో చిత్రీకరణతో పారదర్శకంగా డ్రా నిర్వహించినట్లు చెప్పారు. పామ్నూర్‌లో 40, కళ్లెంలో 30, తిమ్మంపేటలో 25, తమ్మడపల్లి పరిధిలో 13 ఇళ్ల కు లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఎంపికైన వారి అర్హతలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం తుది కేటాయింపు ఉత్తర్వులు జారీ చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఎంపిక జాబితాలను సంబంధిత కార్యాలయాలు, జిల్లా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఆర్డీఓ కిరణ్ ప్రకాష్, సంబంధిత తహసీల్దార్లు , అధికారులు పాల్గొన్నారు

# గ్రామీణ ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ఉత్తమ వైద్య సేవలు అందించాలి

### జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



**ఖమ్మం, మధిర, సెప్టెంబరు 12 : ( సమయం న్యూస్ )**ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రతి రోగికి సకాలంలో నాణ్యమైన, వైద్య సేవలు అందేలా అధికారులు, వైద్యులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. శనివారం మధిర పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, వైద్యులు, సిబ్బంది హాజరు, ఓపీ సేవలు, ల్యాబ్ పరీక్షలు, ఔషధాల లభ్యత, వార్డుల నిర్వహణ, రోగుల నమోదు విధానం, పారిశుద్ధ్య నిర్వహణ, పరిశుభ్రత తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. చికిత్స పొందుతున్న రోగులు, బంధువులతో నేరుగా మాట్లాడిన కలెక్టర్ వారికి అందుతున్న వైద్య సేవలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా

అయన మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే ప్రతి ఒక్కరికి నాణ్యమైన, ఉచిత వైద్య సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని, ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రులపై పూర్తి విశ్వాసంతో సేవలు పొందేలా వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని తెలిపారు. రోగులకి సకల సౌకర్యాలు ఉండాలని మధిర హాస్పిటల్లో అన్ని వైద్య సేవలు దొరుకుతాయనే విశ్వాసాన్ని నమ్మకాన్ని మధిర ప్రజలకే కాకుండా చుట్టుపక్కల నియోజకవర్గం ప్రజలకి కల్గించాలని అన్నారు. ఆసుపత్రి పరిసరాలను ఎల్ల వ్వుడూ పరిశుభ్రంగా ఉంచాలని, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్య సదుపాయాలు, ఇతర మౌలిక వసతులు మెరుగ్గా ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి ఒక్కరికీ సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత అధికారులదేనని కలెక్టర్ స్పష్టం చేశారు. అంతకు ముందు మధిర మండలం కేంద్రంలో నూతనంగా మూడు కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కాలేజ్, నాలుగు కోట్ల అంచనా వ్యయంతో ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ అదనపు భవనం నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం మధిర మండలంలోని సిరిపురం గ్రామంలో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవనం నిర్మాణ పనులు, అలాగే ఐటిఐ భవనం, ఏటిసీ సెంటర్ నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు.

# మట్టి వినాయకుల తయారీలో విద్యార్థినుల ప్రతిభ





**మహబూబ్‌నగర్: సెప్టెంబర్12( సమయం న్యూస్ )** వినాయక చవితి సందర్భంగా తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల (మహిళలు), మహబూబ్‌నగర్‌లో ఎకో క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థినులు పర్యావరణహిత మట్టి వినాయకుల ప్రతిమలను తయారు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నెహ్రూ యువజన కేంద్ర–మై భారత్ కన్వీనర్ కోట నాయక్, యూత్ ఐకాన్ రాజేంద్ర గౌడ్, అనిల్ హాజరయ్యారు. విద్యార్థినులు రూపొందించిన మట్టి వినాయక ప్రతిమలను పరిశీలించి ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ బహుమతులు అందజేయడంతో పాటు విజేతలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్, అధ్యాపక బృందం, విద్యార్థినులు పాల్గొన్నారు.

# బంగారు, వెండి ఆభరణాల చోరీ కేసు ఛేదన

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 12(సమయం న్యూస్)** గుడిహత్నూర్‌లో జరిగిన బంగారు, వెండి ఆభరణాల చోరీ కేసును పోలీసులు ఛేదించారు. రూ.85,600 విలువైన ఆభరణాలను 100 శాతం రికవరీ చేసి, ప్రధాన నిందితుడు పెండూర్ మధుకర్ (21)ను అరెస్ట్ చేసినట్లు ఎస్సై ఎల్. శ్రీకాంత్ తెలిపారు. క్లూస్ టీం, ఫింగర్ ప్రింట్ ఆధారాలతో కేసును ఛేదించిన పోలీసులు, చోరీ సొత్తు కొనుగోలు చేసిన గోల్డ్‌స్మిత్ దహలే సంతోష్ (46)పై కూడా కేసు నమోదు చేశారు.

# ఖైరతాబాద్ బడా గణేష్ ఉత్సవాల సందర్భంగా ట్రాఫిక్ ఆంక్షలు




**హైదరాబాద్, సెప్టెంబర్ 12( సమయం న్యూస్)** ఖైరతాబాద్ బడా గణేష్ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని పురస్కరించుకుని భక్తుల రద్దీ దృష్ట్యా సెప్టెంబర్ 12 నుంచి 24 వరకు ప్రతిరోజూ ఉదయం 11 గంటల నుంచి రాత్రి వరకు అవసరాన్ని బట్టి ట్రాఫిక్ మళ్లింపులు అమలు చేయనున్నట్లు హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. వీవీ విగ్రహం, పాత పీఎస్ సైఫాబాద్, ఇక్బాల్ మినార్, నెక్లెస్ రోటరీ, నిరంకారి వైపు నుంచి బడా గణేష్ పరిసరాలకు వచ్చే సాధారణ ట్రాఫిక్‌ను ప్రత్యామ్నాయ మార్గాలకు మళ్లించనున్నారు. ఖైరతాబాద్, షాదాన్ కాలేజ్, అయోధ్య, నిరంకారి, మింట్ కాంపౌండ్, ఎన్టీఆర్ మార్గ్, సెక్రటేరియట్ జంక్షన్, నెక్లెస్ రోటరీ, కేసీపీ జంక్షన్, మాసాబ్ ట్యాంక్ ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉన్నందున ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని సూచించారు. భక్తుల కోసం రేస్ కోర్స్ రోడ్, ఎన్టీఆర్ ఘాట్, ఐమ్యాక్స్ సమీపంలోని హెచ్ఎండీఏ పార్కింగ్, ఐమ్యాక్స్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలం, విశ్వేశ్వరయ్య భవన్ వద్ద పార్కింగ్ సదుపాయాలు ఏర్పాటు చేశారు. అత్యవసర ట్రాఫిక్ సహాయం కోసం 9010203626 హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ డి. జోయెల్ డేవిస్ కోరారు.

# పర్యావరణ పరిరక్షణకు మట్టి గణేష్ విగ్రహాలనే వినియోగించాలి




**నిజామాబాద్ సెప్టెంబర్12( సమయం న్యూస్)** వినాయక చవితి పండుగను పురస్కరించుకొని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మట్టి గణేష్ విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా అదనపు కలెక్టర్ (ఎల్బీ) భుజంగరావు ఎస్ఆర్ఎస్పీ సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణానికి అనుకూలమైన మట్టి గణేష్ విగ్రహాలను ప్రతిష్ఠించి, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమంలో భాగంగా 8 అంగుళాల మట్టి గణపతి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేస్తూ, పర్యావరణ పరిరక్షణపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజనీర్ రవిదాస్ తెలిపారు. కార్యక్రమంలో పీసీబీ సిబ్బంది, జూనియర్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# వివాదాలకు రాజీ మార్గమే శాశ్వత పరిష్కారం




### జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి. నీరజ

**సిరిసిల్ల, సెప్టెంబర్ 12( సమయం న్యూస్)** చిన్నచిన్న వివాదాలను పెద్దవిగా చేసుకొని శారీరకంగా, ఆర్థికంగా, మానసికంగా నష్టపోకుండా పరస్పర అవగాహనతో పరిష్కరించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షురాలు పి. నీరజ సూచించారు. శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ ప్రారంభ సమావేశంలో ఆమె మాట్లా డుతూ, కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న రాజీ చేయదగిన కేసులు, ప్రీ–లిటిగేషన్ కేసులను పరస్పర అంగీకారంతో పరిష్కరించేందుకు లోక్ అదాలత్ ఉత్తమ వేదిక అని తెలిపారు. భార్యాభర్తలు చిన్న విభేదాలతో విడిపోకుండా పరస్పరం అర్థం చేసుకోవాలని, అన్నదమ్ములు ఆస్తి, భూ వివాదాలను రాజీ ద్వారా పరిష్కరించుకొని కుటుంబ ఐక్యతను కాపాడుకోవాలని కోరారు. లోక్ అదాలత్ ద్వారా సమయం, డబ్బు ఆదా కావడంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని పేర్కొన్నారు.కార్యక్రమంలో పోక్సో కోర్టు న్యాయమూర్తి రాధిక జైస్వాల్, డీఎల్ఎస్ఏ కార్యదర్శి పి. లక్ష్మణాచారి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆవునూరి రమాకాంతరావు, డీఎస్పీ నాగేంద్రచారి, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు

# ఏఐపై వర్కింగ్ జర్నలిస్టు లకు వర్క్‌షాప్

**హైదరాబాద్, సెప్టెంబర్ 12( సమయం న్యూస్)** వర్కింగ్ జర్నలిస్టుల కోసం తెలంగాణ మీడియా అకాడమీ సెప్టెంబర్ 16న "ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI)"పై ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించనుంది. నాంపల్లి, ఛాపెల్ రోడ్డులోని మీడియా అకాడమీ ఆడిటోరియంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ కార్యక్రమం జరుగుతుంది. ఏఐ పరిచయం, వినియోగించే టూల్స్, పద్ధతులు, బాధ్యతాయుత వినియోగం, నైతిక ప్రమాణాలపై శిక్షణ ఇవ్వనున్నారు. ఆసక్తి గల జర్నలిస్టులు పేరు, మీడియా సంస్థ, ప్రదేశం, మొబైల్ నంబర్ వివరాలను 7093600977 వాట్సాప్ నంబర్‌కు సెప్టెంబర్ 15లోగా పంపాలి. ముందుగా నమోదు చేసుకున్న అర్హత గల 50 మందికి అవకాశం కల్పిస్తామని తెలంగాణ మీడియా అకాడమీ మేనేజర్ డి.ఆర్.ఎస్. శైలేశ్వర్ రెడ్డి తెలిపారు. కావాలంటే దీన్ని ఇంకా 5–6 లైన్లలో మరింత క్లుప్తంగా కూడా ఇస్తాను.